







- రూ.5 కోట్ల విలువైన సత్రం స్థలం స్వాహా
- దాతల ఆశయం నీరుగార్చిన నేతలు
- స్థలాన్ని కబ్జా చేసేందుకు రికార్డుల తారుమారు
- నిషేధిత భూముల జాబితాలో ఉన్నా ఆన్‌లైన్

సమాధి స్థలాన్నీ.. వదల్లేదు..!

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26: అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే ఉన్న కోట్ల రూపాయల విలువైన స్థలంపై కొందరు అధికార పార్టీ నేతలు కన్నువేశారు. రికార్డులు తారుమారు చేసి భూమి కబ్జాకు యత్నిస్తున్నారు. అందుకోసం రెవెన్యూ రికార్డులను సైతం తారుమారు చేస్తున్నారు. ఎప్పుడో 60 ఏళ్ల క్రితం దాతలు ఇచ్చిన స్థలానికి సైతం టెండర్ పెట్టిన తీరు చూస్తే ఆశ్చర్యం కలిగిస్తోంది.

భూమి రికార్డులు తారుమారు..

అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారి పక్కనే వున్న స్థలాన్ని బాటసారుల సౌకర్యం కొరకు సత్రం నిర్మించేందుకు కామేపల్లి గ్రామ రజక సామాజికవర్గానికి చెందిన వినుకొండ బుచ్చయ్య కుమారులు నారాయణ, రంగయ్య, వెంకటేష్‌లు కలిసి దానం చేశారు. కామేపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 283/1లో సుమారు 50 సెంట్లు భూమిని ధర్మ సత్రం నిర్వహణ నిమిత్తం జూన్ 6, 1958లో సత్రం పేరుతో బుచ్చయ్య కుమారుడైన నారాయణను మేనేజర్‌గా చూపుతూ 949/1958 డాక్యుమెంట్ నెంబర్‌తో రిజిస్టర్ చేశారు. నారాయణ, రంగయ్య, వెంకటేష్‌లు తండ్రి బుచ్చయ్య మరణానంతరం సమాధి చేసిన స్థలంలో ఏటా ఆరాధన ఉత్సవాలు జరపడంతో పాటు రెండు గదుల సత్రాన్ని బాటసారుల విశ్రాంతి కొరకు నిర్మించారు. నీటి అవసరాలకు పక్కనే బావిని కూడా తవ్వించారు. సత్రం నిర్వహణ, ఆరాధన, బావి మరమ్మతుల కింద కామేపల్లి పరిధిలోని 283/1ఎ సర్వే నెంబరులో సుమారు 50 సెంట్ల భూమిని బుచ్చయ్య కుమారులు రిజిస్ట్రేషన్ చేశారు. తదనంతర వారసులు కూడా ఆస్తిని అమ్మే హక్కు లేకుండా సత్రం బాగోగులు, ఆరాధన, బావి మరమ్మతుల నిర్వహణ కొరకే భూమిని వాడుకోవాలని, విక్రయించే హక్కు లేకుండా రిజిస్టర్‌లో పొందుపరిచారు. కాలక్రమేణ ఆ స్థలంలో అప్పట్లో నిర్మించిన సత్రం శిథిలావస్థకు చేరి పూర్తిగా పడిపోయింది. ఇక్కడి నుండే అసలు కథ మొదలైంది.

మహిళ పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు..

గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నేతలు ఆ స్థలంపై కన్నేసి కొన్ని నెలల క్రితమే గ్రావెల్ తోలి చదును చేసేశారు. ఆ తరువాత అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. విషయం తెలుసుకున్న దాతల వారసులు ఆరు నెలల క్రితమే పిడుగురాళ్ల తహసీల్దార్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. పలుమార్లు రెవెన్యూ కార్యాలయానికి తిరిగి విసుగు చెంది పరిష్కారం కాకపోవడంతో ఈ నెల 19న నరసరావుపేట స్పందన కార్యక్రమంలో మరోసారి ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ 1958లో సత్రం నిర్వహణకు రిజిస్టర్ చేసిన దస్తావేజు చూపినప్పటికీ రెవెన్యూ అధికారులు కొందరికి భారీగా ముడుపులు అందడంతో దస్తావేజు విషయాన్ని పక్కన పెట్టేసి ఆన్‌లైన్ చేశారు. రికార్డులను సైతం తారుమారు చేసి ఓ మహిళ పేరుతో రికార్డుల్లో ఎక్కించి తరువాత రిజిస్ట్రేషన్ చేసేందుకు కార్యాలయానికి వెళ్లగా ఆ సర్వే నెంబరు 22ఎ (నిషేధిత భూముల జాబితా)లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ జరిపేందుకు వీలులేదని సబ్‌రిజిస్ట్రార్ చెప్పడంతో ఆమెపై కూడా కేసు రిజిస్టర్ చేయాలంటూ కొంత ఒత్తిడిలు తెచ్చినా ససేమిరా అన్నట్లు తెలిసింది.

రూ.25 లక్షలు చేతులు మారాయి..

అసలు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, అవినీతితో రూ.5 కోట్ల విలువైన భూమిని సైతం సంబంధం లేని వ్యక్తుల పేరుతో ఏ విధంగా పేర్లు మార్చారనేది ప్రశ్నార్థకం. రికార్డులను తారుమారుచేసి ఓ మహిళ పేరుతో రికార్డులు రాయడానికి బదిలీ అయిన తహసీల్దార్, సెలవులో వున్న మరో వీఆర్‌ఓ ప్రమేయంతోనే ఇదంతా జరిగిందని దాతల కుటుంబసభ్యులు, మరికొందరు నేరుగా కలెక్టర్‌కే ఫిర్యాదు చేశారు. దీనికోసం రూ.25 లక్షలు చేతులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా కామేపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 341/1 కూడా ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉన్నప్పటికీ మరికొందరి పేర్లతో రికార్డులు మార్చేయడం వెనుక పెద్దఎత్తున నగదు చేతులు మారాయని తెలుస్తుంది. మొత్తం మీద రెవెన్యూ కార్యాలయాల్లో అనధికారికంగా కొందరు రెవెన్యూ పనులు చక్కబెట్టేవారు కూడా ఇలాంటి వాటిని తెరవెనుక ఉండి నడిపిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

సంక్షేమం సందేహం

- వాయిదాలతో లబ్ధిదారుల్లో ఆందోళన
- ఎన్నికల కోడ్ ముంచుకొస్తున్నా తాత్సారం
- నిరవధికంగా వాయిదా పడిన చేయూత పథకం
- అదే బాటలో విద్యాదీవెన, ఈబీసీ నేస్తం పథకాలు

చేయూత వాయిదా పడింది.. విద్యా దీవెన వాయిదా వేశారు.. ఈబీసీ నేస్తం ఇప్పుడు కాదంటున్నారు.. మొత్తంమీద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న సంక్షేమ పథకాల అమల్లో సందేహాలు నెలకొంటున్నాయి. ఆయా పథకాల నగదు ఎప్పుడు పడుతుందో.. అసలు పడుతుందా లేదా అనేది అనుమానంగా ఉంది. ఒక వైపు ఎన్నికల కోడ్ తరుముకొస్తుంటే, మరోవైపు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తేదీలను వాయిదా వేస్తూ వస్తోంది. తాజాగా ఈ నెల 26న అమలు చేస్తామని ప్రకటించిన వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. జగనన్న విద్యాదీవెన, ఈబీసీ నేస్తం పథకాలు కూడా అదే బాటలో ఉన్నాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళనలు నెలకొన్నాయి.

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత సంక్షేమ పథకాల అమలుకు ఎన్నికల సంఘం చెక్ పెడుతుంది. ఇదంతా తెలిసి కూడా ప్రభుత్వం సంక్షేమ పథకాలను వాయిదా వేస్తూ వస్తోంది. ఈ నెల 26న ప్రారంభం కావాల్సిన నాలుగో విడత చేయూత పథకాన్ని తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా చెప్పకుండా ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 2 లక్షల 70 వేల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కావాలనే ఎన్నికల కోడ్ వచ్చే వరకు తాత్సారం చేస్తూ వస్తోందేమోనన్న అనుమానం లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతోంది.




వాయిదాల పర్వంతో వంచన

వాయిదా పద్ధతిని అనుసరిస్తూ ప్రభుత్వం ఆది నుంచి సంక్షేమ పథకాలను నీరుగారుస్తూ వస్తోంది. 2019 అధికారంలోకి వచ్చిన వెంటనే పథకంపై హడావుడి చేసిన ప్రభుత్వం 2020 ఆగస్టు 12 వరకూ ఆ పథకం ఊసే ఎత్తలేదు. అధికారం చేపట్టిన 14 నెలల వరకూ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనైనా ప్రారంభించలేదు. ఆ తర్వాత 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం మరో 16 నెలల తర్వాత 2022 సెప్టెంబరు 23న మూడో దఫా చేయూత అందించింది. మూడో దఫా చేయూత అంది ఇప్పటికి 16 నెలలు కావస్తున్నా నాలుగో దఫా చేయూత విడుదల చేయలేదు. కిందటేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ పథకాన్ని ప్రారంభించలేదు. తొలుత అక్టోబరులో అని, ఆ తర్వాత జనవరిలో అని, అటు పిమ్మట ఫిబ్రవరి చివర్లో అని, ఆఖరికి అది కూడా వాయిదా వేశారు. దీంతో లబ్ధిదారులు ఈసురోమంటున్నారు.

● ప్రకటనల్లోనే.. క్యాలెండరు

ప్రతి ఏటా సంక్షేమ క్యాలెండరు విడుదల చేస్తాం. ఆ ప్రకారం పథకాలను అమలు చేస్తాం అని బడాయి మాటలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో లబ్ధిదారులను అడుగడుగునా వంచించింది. ప్రతి ఏటా అమలు చేస్తానన్న పథకాలను వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ నెట్టుకొస్తోంది. ఐదేళ్ల పాలనలో ఒక్క సంక్షేమం కూడా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఐదేళ్లలో వైఎస్సార్ చేయూత నాలుగు దఫాలకు మూడు దఫాలు, అమ్మఒడి ఐదేళ్లకు నాలుగు దఫాలు మాత్రమే అమలు జరిగింది. ఆసరా పథకం నాలుగో దఫా బటన్ నొక్కినా ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బు మాత్రం జమకాలేదు. జగనన్న విద్యాదీవెన మూడు, నాలుగు దఫాలుగా విద్యార్థులకు దక్కడం లేదు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పరిస్థితి అంతే. ప్రభుత్వం ఏనాడో ప్రకటించాల్సిన ఈబీసీ నేస్తం, విద్యాదీవెన పథకాలను కూడా ఫిబ్రవరికి వాయిదా వేసింది. ఎన్నికల కోడ్ వచ్చే లోపు అవి కూడా అమలవుతాయో లేదో అనుమానమే.



రైల్వేస్టేషన్లు.. జాతికి అంకితం

● కొన్ని పనులకు శంకుస్థాపన ● వీడియో లింకు ద్వారా ప్రారంభించిన ప్రధాని మోదీ ● గుంటూరులో హాజరైన బీజేపీ నేత సత్యకుమార్, డీఆర్ఎం ఎం. రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పేదలకు విమానాశ్రయాల స్థాయి సదుపాయాలు కల్పించడమే అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ ముఖ్య ఉద్దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన వీడియో లింకు ద్వారా ఏబీఎస్ఎస్ కింద అభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్లను జాతికి అంకితం చేశారు. అలానే మరికొన్ని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శంకుస్థాపన చేశారు. కొత్తగా నిర్మించిన ఆర్‌యూబీలను ప్రారంభించారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రధానమైన గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, బీజేపీ రాష్ట్ర నాయకుడు సత్యకుమార్, గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ, ఇతర అధికారులు, జెడ్ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీ సభ్యులు హాజరయ్యారు. ఏబీఎస్ఎస్ కింద రూ.17.13 కోట్ల వ్యయంతో బాపట్ల, రూ. 15.80 కోట్లతో గుంటూరు, రూ.40.67 కోట్లతో మంగళగిరి, రూ.11.30 కోట్లతో నరసరావుపేట, రూ.11.30 కోట్లతో సత్తెనపల్లి రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ పూర్తి అయితే ఉత్తమ శ్రేణితో కూడిన అనుభూతి ప్రయాణీకులకు కలుగుతుందని ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ అన్నారు. అదే విధంగా ఎన్ఎస్‌జీ-5 కేటిగిరీకి చెందిన పలు స్టేషన్ల అభివృద్ధి పనులను, అలానే ఆర్‌యూబీలకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలను గుంటూరు డివిజన్‌లో సోమవారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక పాఠశాలల విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వికసిత్ రైల్వేస్టేషన్ల కాన్సెప్ట్‌తో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అలానే స్థానిక ప్రజాప్రతినిధులను కూడా పాల్గొనేలా చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఆర్ఎంలు ఆర్.శ్రీనివాస్, కె.సైమన్, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ జీవీ అనూష తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలో శిలాఫలకం వద్ద బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు

సైకిల్.. సవాల్

- తమ్ముళ్లు హుషారు.. ఫ్యాన్ పార్టీలో బేజారు..!

త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరతా: లావు

త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాలో జరగబోయే భారీ బహిరంగ సభలో పార్టీ అధినేత నారా చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. నరసరావుపేట ఎంపీ స్థానానికి మరోసారి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనను మంచి మనసుతో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానన్నారు. మరోసారి ఎంపీగా అవకాశం ఇస్తే మరింత ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. నియోజకవర్గ పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రైతులు, కార్మికులు అన్నివర్గాల ప్రజలను మునుపటి లాగానే కలుపుకొని పోతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి మంజూరైన, చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తానని రాయలు తెలిపారు. లావుతో పాటే ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ శాసనసభ్యుడు మక్కెన మల్లికార్జునరావు, పలువురు వైసీపీ నేతలు, స్థానిక సంస్థల ప్రతినిధులు టీడీపీలో చేరనున్నారు.

పల్నాడు జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు తొలివిడతలో అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ వైసీపీకి సవాల్ విసిరింది. జనసేనతో పొత్తు, స్థానిక పరిస్థితులు, సర్వే నివేదికల నేపథ్యంలో చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. మిగతా స్థానాల మీద అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేస్తోంది. మరోవైపు ఫ్యాన్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక లో గందరగోళం నెలకొంది. ఒక్క చిలకలూరిపేట మినహా జిల్లాలో వైసీపీ అధికారికంగా అభ్యర్థులను ప్రకటించలేదు. ఎంపికపై వైసీపీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. దీంతో పలు నియోజక వర్గాల్లో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రోజుకో పేరుతో వివిధనియోజక వర్గాల్లో ఐప్యాక్ సర్వే చేయించుకోవడంలోనే వైసీపీ నిమగ్నమైంది.

- పల్నాడు జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ
- మరో మూడు చోట్ల అభ్యర్థుల ఎంపిక తుది దశలో..
- వైసీపీ అభ్యర్థుల ప్రకటనపై మల్లగుల్లాలు
- ఒకరిద్దరు ఎమ్మెల్యేలకు తిరిగి టికెట్ దక్కదని ప్రచారం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ ఎన్నికల శంఖారావం పూరించింది. ఎన్నికల బరిలో దిగనున్న అభ్యర్థుల తొలి జాబితాను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అందులో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. దీంతో ఆయా నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. సత్తెనపల్లి నుంచి మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట నుంచి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, వినుకొండ నుంచి మాజీ శాసనసభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాచర్ల నుంచి జూలకంటి బ్రహ్మారెడ్డి టీడీపీ నుంచి పోటీ చేస్తున్నారు. జిల్లాలో ఇంకా మూడుచోట్ల నరసరావుపేట, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ మూడుచోట్ల అభ్యర్థులను దాదాపు ఖరారు చేశారన్న ప్రచారం జరుగుతోంది. సర్వేలు, సామాజిక వర్గాల సమీకరణ అంశాల ఆధారంగా ఈ మూడు చోట్ల అభ్యర్థులను ఎంపిక చేసే కసరత్తు ఒక కొలిక్కి వచ్చినట్లు పార్టీ పెద్దలు చెబుతున్నారు.



పల్నాడు రోడ్డులో తెలుగుయవత నేత రావెల జ్ఞాని నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యాయం నిర్మాణ పనులు

నరసరావుపేటలో భారీ టీడీపీ కార్యాలయం

నరసరావుపేటలో భారీస్థాయిలో తెలుగుదేశం కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తెలుగుయవత నాయకుడు రావెల జ్ఞాని నేతృత్వంలో కార్యాలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జ్ఞాని తన సొంత నిధులతో కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థులు వినియోగించుకొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నాలుగ్రైదు రోజుల్లోనే కార్యాలయం పనులు పూర్తి కానున్నాయి.

వైసీపీ అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానం ఆపసోపాలు..

తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ప్రకటించుకొని ఎన్నికల క్షేత్రంలో దూసుకుపోతుంటే వైసీపీలో అభ్యర్థుల ఎంపికలో గందరగోళం నెలకొంది. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పార్టీ క్యాడర్ నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఒక్క చిలకలూరిపేటకు మాత్రమే మల్లెల రాజేష్‌నాయుడు పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఆరు నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ అభ్యర్థుల పేర్లను అధికారికంగా అధిష్ఠానం ప్రకటించలేదు. అయితే తాడేపల్లి ప్యాలెస్‌లోని పార్టీ పెద్దలు నరసరావుపేట నుంచి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల నుంచి కాసు మహేష్‌రెడ్డి పోటీచేస్తారని ప్రకటించారు. చిలకలూరిపేట మినహా అధిష్ఠానం మిగతా నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదని పార్టీలో ముఖ్యనేతలు చెబుతున్నారు. మాచర్ల మినహా మిగతా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను పార్టీలోని ముఖ్యులు తీవ్రంగా వ్యతికిస్తున్నారు. వినుకొండలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు బొల్లాను వ్యతిరేకిస్తూ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసింది. ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా వైసీపీని వీడనున్నారు. జంగా, మక్కెన 26న తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. సత్తెనపల్లిలో మంత్రి రాంబాబు, పెదకూరపాడులో నంబూరు శంకరరావులపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్టీ నేతలు వారిపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. సత్తెనపల్లిలో రోజుకో పేరుతో ఐప్యాక్ సర్వే నిర్వహిస్తోంది. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేరుతో సర్వే నిర్వహించారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్లతో ఐప్యాక్ సర్వే నిర్వహిస్తోంది. మొత్తం మీద వైసీపీలో నలుగురు ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్లు ఇవ్వొద్దన్న ఉద్యమాన్ని నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ నిర్వహిస్తోంది. నియోజవర్గాల్లో నెలకొన్న అసమ్మతి పలువురు ఎమ్మెల్యేలకు తల నొప్పిగా మారింది. ఒకరిద్దరు ఎమ్మెల్యేలకు తిరిగి పార్టీ టిక్కెట్ దక్కదన్న ప్రచారం జరుగుతోంది.

కలిసి నడుస్తా..

- చంద్రబాబుతోనే రాష్ట్రానికి మేలు
- మక్కెన మల్లికార్జునరావు
- సమష్టి కృషితో టీడీపీ-జనసేన కూటమిని గెలిపిద్దాం ● జీవీ ఆంజనేయులు



మక్కెనకు శాలువా కప్పి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 26: సమష్టి కృషితో టీడీపీ- జనసేన కూటమిని గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సోమవారం తన అనుచరులతో కలిసి జీవీ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు, టీడీపీ శ్రేణులు మక్కెన, అతని అనుచరులకు స్వాగతం పలికి శాలువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జీవీ, మక్కెన అనుచరులు బాణాసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో తొలుత మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు లాంటి అనుభవజ్ఞుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి మేలు జరుగుతుందని అన్నారు. అలాగే వినుకొండ అభివృద్ధికి జీవీ ఆంజనేయులుతో కలిసి పనిచేయడానికి తాను, తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరనున్నట్లు మక్కెన తెలిపారు. రానున్న రోజుల్లో చంద్రబాబు సమక్షంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, తాను టీడీపీలో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారంతో, అహకారంతో వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తులకు గౌరవం లేకుండా వ్యవహరించడం, ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, మీసాలు తిప్పి తొడకొట్టడం వంటి వాటివల్ల వినుకొండ ప్రాంతానికి చెడ్డపేరు తీసుకొస్తున్నాడని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కంటే ముందు 9మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారని, వారందరూ ఏమీ చేయనట్టు, ఈయన ఒక్కడే వినుకొండను అభివృద్ధి చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అటవీశాఖ అనుమతులు, అండర్‌పాస్ బ్రిడ్జిలు, జాతీయ రహదారి హోదా కల్పించడం వంటి కార్యక్రమాలు చేస్తే అవికూడా తానే చేసినట్లుగా బొల్లా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. రైతు గడిపూడి నరేంద్ర, డాక్టర్ లతీష్ రెడ్డి పట్ల ఆయన ప్రవర్తించిన తీరును అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా కూడా ఎలాంటి ఫలితం లేకపోవడం వల్ల పార్టీ మారుతున్నట్లు ఆయన వివరించారు. గత ఎన్నికల సమయంలో తాను డబ్బు తీసుకున్నట్లుగా బొల్లా చెప్పారని, ఈ విషయంపై బ్రహ్మనాయుడు ఊరిలో కట్టించిన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో తాను తీసుకోలేదని ప్రమాణం చేస్తానని అన్నారు. అదే గ్రామంలో రైతుపై బొల్లా బ్రహ్మనాయుడు చెప్పు తీసుకొని కొట్టబోయాడని ప్రమాణం చేస్తానని.. తాను కొట్టబోలేదని బ్రహ్మనాయుడు ప్రమాణం చేయగలడా అని మక్కెన సవాల్ విసిరారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా జీవీ, రాజీవ్ ఫౌండేషన్ ద్వారా తాను చేసిన సేవా కార్యక్రమాలను కూడా బొల్లా విమర్శించడాన్ని మక్కెన ఖండించారు. హింస, ప్రజలను రెచ్చగొట్టే ధోరణితో ఓట్లు సంపాదించుకోవాలనే ఉద్దేశం మంచి పద్ధతి కాదని, దీని ద్వారా కార్యకర్తలను బలి చేయడమే అవుతుందని అన్నారు. మీకు అంత చూసుకోవాలని ఉంటే మనమిద్దరమే చూసుకుందాం రా.. అని బొల్లాను ఉద్దేశించి మక్కెన అన్నారు.

అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ ప్రాంత ప్రజల ఆశీస్సులతో మరోసారి టీడీపీ జనసేన తరఫున టికెట్ తనకు ప్రకటించారని, మాజీ ఎమ్మెల్యే మక్కెన అపార అనుభవం వినుకొండ అభివృద్ధికి, నా గెలుపుకు దోహదపడతాయని, వారికి, వారి అనుచరులను గౌరవప్రదంగా పార్టీ చూసుకుంటుందని అన్నారు. వినుకొండ ప్రాంత అభివృద్ధికి గత ఐదు సంవత్సరాల్లో ఎంపీ కృష్ణదేవరాయలు కృషి చేశారని, ఆయన టీడీపీలోకి రావడాన్ని ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. తాము అధికారంలోకి రాగానే ఫేజ్ -1లోనే వరికపూడిశెల పూర్తి చేస్తామని, గుండ్లకమ్మ నదిపై అవసరమైన చోట్ల చెక్‌డ్యాంలు నిర్మిస్తామని, ఇంటింటికి తాగునీరు అందించడానికి కృషి చేస్తామని, ఎన్ఎస్‌పీ స్థలంలో స్టేడియం, పార్కు, షాపింగ్ కాంప్లెక్స్, టీటీడీ కల్యాణ మండపం, షాదీఖాన్, బీసీ భవన్, అంబేడ్కర్ భవన్‌లు నిర్మిస్తామని తెలిపారు. ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడుకు నియోజకవర్గంలో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా పోలీసులను అడ్డంపెట్టుకొని లా అండ్ ఆర్డర్‌కు తూట్లు పొడుస్తూ అహంకారంతో రెచ్చిపోతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన 167 స్థానాలు గెలిచి అధికారం చేపట్టడం ఖాయమని జీవీ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మక్కెన అనుచరులు పాల్గొన్నారు.

మౌర్యుల అనంతరం రాజ వంశాలు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

శుంగవంశం

క్రీ.పూ.185లో చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని చంపి అతని సేనాని పుష్యమిత్రుడు 'శుంగ' వంశాన్ని స్థాపించాడు. మగధను రాజధానిగా చేసుకుని పాలించాడు. ఇతని కాలంలోనే అయోధ్య శాసనాన్ని ధనదేవుడు చెక్కించాడు.

పుష్యమిత్రుని సమకాలీనులు: పంజాబ్, కాబూల్ ప్రాంతాలను పాలిస్తున్న ఇండో గ్రీకు రాజు మినాండర్, కళింగ రాజు ఖారవేలుడు, శాతవాహన రాజు మొదటి శాతకర్ణి ఇతని సమకాలీనులు. అయితే అశ్వమేథ యాగం సందర్భంగా పుష్యమిత్రుని మినాండర్ ఓడించినట్లు తెలుస్తోంది.

శుంగ వంశ చరిత్రకు ఆధారాలు: పతంజలి- మహాభాష్యం, కాళిదాసు- మాళవికాగ్నిమిత్రం, పాణిని - అష్టాధ్యాయి, బాణుడు- హర్ష చరిత్ర, బౌద్ధ గ్రంథం- దివ్యావాదన మొదలైనవి. ఉజ్జయిని రాకుమార్తె మాళవికను పుష్యమిత్రశుంగుని కుమారుడైన అగ్నిమిత్రుడు రాక్షస వివాహం చేసుకున్న ఇతివృత్తమే కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం'.

శుంగుల మత విధానం: శుంగుల కాలంలో వైదిక (బ్రాహ్మణ) మతం పునరుద్ధరణ జరిగింది.(దేవభూతి క్రీ.శ.72లో కణ్వ వంశీయుడైన వాసుదేవ కణ్వ చేతిలో మరణించాడు. దీంతో కణ్వవంశ స్థాపన జరిగి, శుంగ వంశం అంతరించింది).

- పుష్యమిత్ర శుంగుని కాలంలో సాంచి, బార్హుత్ స్థూపాలకు వాస్తుపరమైన అలంకరణ చేశారు. దీనిని బట్టి పరమత సహనం ఉన్నట్లు అర్థమవుతుంది. పుష్యమిత్రుడు అనేక మంది బౌద్ధులను సంహరించినట్లు పలు బౌద్ధ గ్రంథాల్లో రాసి ఉంది. కాని బిహార్, అయోధ్య, మాళ్వా ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు శుంగుల కాలంలోనే వర్ధిల్లినట్లు 'మహావంశం' అనే బౌద్ధ గ్రంథం పేర్కొంటోంది.
- చివరి శుంగ రాజులలో గొప్ప వాడైన భగబద్రరాజు ఆస్థానంలో గ్రీకు రాయబారి హీలియోడోరస్ (గ్రీకు రాజైన ఆంటియోకిడాస్ ఆస్థానం నుంచి వచ్చాడు) చేరాడు. ఈయన భిల్సా దగ్గర ఉన్న బేస్‌నగర్‌లోని విష్ణుదేవాలయంలో గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడే శాసనం కూడా చెక్కించాడు. భాగవతమతం, వాసుదేవ కృష్ణుని గురించి వివరించాడు. రాజకీయంగా చూస్తే... పుష్యమిత్రుని తర్వాత వసుమిత్రుడు, దేవభూతి, భగబద్రుడు మొదలైన వారు పరిపాలించారు. వీరందరి కాలంలో అన్ని మతాలు అభివృద్ధి చెందాయి. వసుమిత్రుడు కోసల రాజు మూలదేముడు చేతిలో హత్యకు గురయ్యాడు.
- శుంగ రాజ్యంలో పాంచాల, కోశాంబి రాజ్యాలు లేవు. అవి అప్పటికే మగధ నుంచి విడిపోయాయి. అంటే శుంగులు మగధను మాత్రమే పాలించారు.

శుంగుల కాలం నాటి ముఖ్యాంశాలు

- వైదిక మతాన్ని, ఆచారాలను, హైందవ పద్ధతులను పునరుద్ధరించారు. సంస్కృత భాషకు ఆదరణ పెరిగింది. పాళి, ప్రాకృత భాషల ప్రాధాన్యం తగ్గింది.
- వాయువ్య సరిహద్దుల వద్ద గ్రీకుల దాడుల నుంచి భారత దేశాన్ని కొన్ని సంవత్సరాల వరకు మాత్రమే కాపాడగలిగారు. ఈ కాలంలో సాంచీ స్థూపానికి తోరణాన్ని అద్భుతంగా చెక్కించారు. తర్వాత శాతవాహన రాజు శాతకర్ణి దీనికి తుది మెరుగులు పెట్టించాడు.
- క్రీ.పూ. రెండో శతాబ్దంలో పాణిని రచించిన వ్యాకరణానికి పతంజలి వ్యాఖ్యానం రాశాడు. దీని పేరు 'మహాభాష్యం'.
- శుంగులు అశ్వమేధయాగాలు చేశారు. వీరి ప్రధాన దైవం విష్ణువు. వీరి కాలంలో భాగవతం ప్రాముఖ్యం పెరిగింది. అయోధ్య శాసనంలో పుష్యమిత్రుడు రెండు అశ్వమేధయాగాలు చేసినట్లు రాసి ఉంది.

మౌర్యులు - శుంగుల శిల్పకళలో భేదాలు

శుంగుల శిల్పకళపై విదేశీ ప్రభావం లేదు. మౌర్యుల శైలికి భిన్నమైన శైలి వీరిది. వీరి కాలంలో బౌద్ధ స్థూపాల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. చైత్యాలు, విహారాలు నిర్మించలేదు. వీరిది మౌర్యుల శిల్పంలా గుండ్రటి రూపం కాదు. అర్ధాకార రీతిలో ఉన్నాయి. మౌర్యుల శిల్పకళ కథకు సంబంధం లేని శిల్పాలు. కాని శుంగులవి జాతక కథలను తెలిపే శిల్పాలు. మౌర్యుల శిల్పాలు ఎక్కువగా జంతువులకు సంబంధించినవి. ఉదాహరణకు...

- ఒకీరా వద్ద సింహస్తంభం - ఎలాంటి అలంకరణ లేదు
- రామ్ పూర్వాస్తంభం - దీనిపై ఏనుగు శిఖరం ఉంది
- లౌరియానందన్‌గర్ - దీని శిఖరంపై సింహం ఉంది
- రుమ్మిందై స్తంభం(నేపాల్) - గుర్రం ఉంది
- సార్‌నాథ్ - దీని శిఖరంపై నాలుగు సింహాలు ఉన్నాయి.

శుంగుల శిల్పాలలో ఎక్కువగా మానవ ఆకారాలు ఉన్నాయి. ఉదాహరణకు బార్హుత్ స్థూపంపై అజాత శత్రు తన తండ్రి బింబిసారుని చంపినందుకు ప్రాయశ్చిత్తం చెప్పవలసిందిగా బుద్ధున్ని అర్థిస్తున్న శిల్పం అద్భుతంగా చెక్కారు.

- మౌర్యుల శిల్పకళను చక్రవర్తులు, బౌద్ధ సంఘాలు, ధనికులైన ప్రజలు పోషించారు. మౌర్యుల కళలలోని పరిణితి శుంగుల శిల్పాలలో కనిపించదు. మౌర్యుల కళపై పర్షియన్ల ప్రభావం ఎక్కువ. శుంగుల కళ స్వదేశీయమైనది. పశ్చిమాసియ శిల్ప కళ ప్రభావం లేక పోలేదు.
- మౌర్యుల శిల్పాలు విడి విడిగా ఉండగా, శుంగుల శిల్పాలు పెద్ద పెద్ద కళా ఖండాల మీద చెక్కారు. శుంగుల చిత్రాలను 'చరణ చిత్రాలు' అంటారు. బౌద్ధానికి చెందినవి. వస్త్రంపై బుద్ధుడి జీవిత విశేషాలు చిత్రీకరించారు. మౌర్యుల కళ లౌకికమైనది.

బార్హుత్ స్థూపం ప్రాధాన్యం



ఈ స్థూపాన్ని అశోకుడు నిర్మించాడు. కాని దీని చుట్టూ గల వేదిక లేక ప్రాకార తోరణాలు క్రీ.పూ.150 నాటి శుంగుల కాలంలో నిర్మించారు. బార్హుత్ స్థూపంలో అప్సరసల శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ స్థూపం మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో ఉంది. దీనిపై ఉన్న అంశాలను అలెగ్జాండర్ కన్నింగ్ హోం గాంధార నుంచి వచ్చినట్లుగా గుర్తించాడు. క్రీ.శ.1873లో అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్ బార్హుత్ స్థూపాన్ని సందర్శించాడు. మరుసటి సంవత్సరం స్థలాన్ని తవ్వాడు. జోసఫ్ డేవిడ్ బెగ్లర్ సహాయకుడిగా పనిచేశాడు. ఈ బౌద్ధశైలి భారతీయ కళ ప్రారంభ దశను సూచించడం, బౌద్ధ చిహ్నంతో ఇండో-గ్రీకు సైనికుడిగా భావించే విదేశీయుడి విగ్రహం ఉండటం... దీనిలోని ప్రత్యేక శైలి.

సాంచి స్థూపం: మొదట అశోకుడు దీనిని నిర్మించాడు. తర్వాత శుంగులు దీనిపై రాతి కప్పు నిర్మాణం చేశారు. దీనిని ఇటుకలతో నిర్మించారు. రాతి అండం, పెద్ద ఛత్రం, వేదిక నిర్మించారు. ఈ స్థూపం తోరణాలపై గల శిల్పాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి.

క్షాత్రప రాజులు

వీరు శకుల వద్ద అధికారులుగా పని చేశారు. తరవాత కొంత కాలం కుషాణులకు కూడా సామంతులుగా ఉన్నారు. క్షాత్రపులందరిలో పశ్చిమ క్షాత్రపులు గొప్పవారు. వీరిలో గొప్పవాడు నహపాణుడు.

నహపాణుడు: శాతవాహనుల నుంచి మహారాష్ట్రను జయించాడు. బరోచ్(గుజరాత్), మహారాష్ట్ర, అజ్మీర్(రాజస్థాన్), మాళ్వా(మధ్యప్రదేశ్) మొదలైన ప్రాంతాలను ఇతను పాలించాడు. నహపాణుడు స్వతంత్రంగా పాలించిన మొదటి క్షాత్రపరాజు. హిందూ సంప్రదాయాలను పాటించాడు. ఇతని భార్య బౌద్ధులకు గుహాలయాలను నిర్మించింది. ఉజ్జయిని క్షాత్రపులలో తొలిరాజు యశోవర్మన్. వీరి వంశం పేరు 'కర్ధమక'. తరవాత రాజు చష్టణుడు. ఉజ్జయిని క్షాత్రపులలో చివరి రాజు రుద్రదాముడు. చష్టనుని కాలం నుంచి వీరు కుషాణులకు సామంతులయ్యారు.

జునాగఢ్ శాసనం: దీనిని రుద్రదమనుడు రాయించాడు. ఇతని గురించిన వివరాలే ఈ శాసనంలో ఎక్కువగా ఉన్నాయి. క్రీ.శ.150లో రుద్రదమనుని పాలన ప్రారంభమైంది. గౌతమీపుత్ర శాతకర్ణి ఇతనికి సమకాలీనుడు. రుద్రదమనుడు మాళ్వా, సౌరాష్ట్ర(గుజరాత్), కచ్, కొంకణతీరం, తూర్పు పంజాబ్, వింధ్యా ఆరావళి పర్వతాల పశ్చిమ ప్రాంతాలను జయించాడు.

- చంద్రగుప్త మౌర్యుని కాలంలో గుజరాత్‌లో నిర్మించిన 'సుదర్శన చెరువు'కు పన్నులు విధించి, మరమ్మతులు చేయించాడు. రుద్రదామునికి సంగీత, తర్క, వ్యాకరణ శాస్త్రాల్లో ప్రావీణ్యం ఉండేది.
- చివరికి శకులు, పహ్లవులు, స్వదేశీ హిందూ సంస్కృతిలో కలిసిపోయారు. హిందూ దేవతలను ఆరాధించారు.



డాక్టర్ ఐ.నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FpZEgVDలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ

కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ, ఫరీదాబాద్)- ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in

ఇన్సూరెన్స్ అకాడమీలో పీజీడీఎం

పుణెలోని నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ(ఎన్ఐఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ, ఏఐయూ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానమైనదిగా గుర్తించింది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, అనలిటిక్స్, టెక్నాలజీ సంబంధిత కోర్ సబ్జెక్టులతో పాటు జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, రీ-ఇన్సూరెన్స్ అండ్ పెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. క్యాట్ 2023లో కనీసం 75 పర్సంటైల్, ఎక్స్‌ఏటీ 2024లో కనీసం 85 పర్సంటైల్, సీమ్యాట్ 2024లో కనీసం 95 పర్సంటైల్ ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్ల మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంపిక: అభ్యర్థులను అకడమిక్ ప్రతిభ, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** pgdm.niapune.org.in

జాబ్ కార్నర్

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

బ్రాంచి వివరాలు: జనరల్ సర్వీస్: 50, పైలెట్: 20, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 18, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 8, లాజిస్టిక్స్: 30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 10, ఎడ్యుకేషన్: 18, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 30, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 50, నావల్ కన్‌స్ట్రక్టర్: 20.

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

సెయిల్‌లో టెక్నీషియన్‌లు

ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... వివిధ విభాగాల్లో ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(ట్రెయినీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 324 (మెటలర్జీ: 57, ఎలక్ట్రికల్: 64, మెకానికల్: 100, సివిల్: 22, కెమికల్: 18).

అర్హతలు: పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిప్లొమా చేసి ఉండాలి. ఓసీటీటీ-డ్రాఫ్ట్‌మన్ పోస్టుకు ఏడాది పాటు డ్రాఫ్ట్‌మన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: https://sail.co.in/

నవ్య | చిత్రజ్యోతి

హాలీవుడ్‌లో రిలీజ్ అనుకున్నాం



శ్రీవిష్ణు

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకుడు. వి. సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మాతలు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇంగ్లీష్‌లో తీసి హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం. ఇలాంటి పాయింట్‌తో ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. మా ముగ్గురి పాత్రలూ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతాయి. రెండు గంటల పాటు నవ్వుతూనే ఉంటారు. గుప్తనిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు. ట్రైలర్, సినిమా అద్భుతంగా ఉంటాయని ప్రియదర్శి చెప్పారు. దాదాపు ఏణ్దార్థం స్పేస్ షూట్‌లో షూటింగ్ చేశాం అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

ఇకమీదట ఇలాంటివి వద్దు



మోహన్‌బాబు

'కొంతమంది స్వార్థపరులు వారి రాజకీయ లబ్ధి కోసం నా పేరును ఉపయోగించుకొంటున్నట్లు తెలిసింది. మీరు ఏ పార్టీ వారైనా మీ ప్రయోజనాల కోసం నా పేరును వాడుకోవద్దు' అని మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఇక మీదట ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన సోమవారం సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఎవరిష్టం వారిది, చేతనైతే నలుగురికి సాయపడాల్సింది పోయి ఏ సంబంధం లేనివారిని రాజకీయాల్లోకి లాగడం బాధాకరమని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్నారు.

అందగత్తెగా అలరించాలనుంది



'హీరోయిన్ అవ్వాలనే నా చిన్ననాటి కలను టాలీవుడ్ నిజం చేసింది. అందుకు తెలుగు పరిశ్రమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇప్పుడు గ్లామర్ పాత్రల్లో ప్రేక్షకులను అలరించాలనేదే నా లక్ష్యం' అని హీరోయిన్ రాశి సింగ్ చెప్పారు. శివ కందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశి సింగ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎయిర్‌హోస్టెస్‌గా ఉద్యోగం చేశాను. చిన్నప్పటి నుంచే హీరోయిన్ అవ్వాలనుకున్నాను. 'ప్రేమ్‌కుమార్, పాపం పసివాడు' సినిమాల్లో నటించాను. కథానాయికగా మంచి పాత్రలు దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది. మున్ముందు వైవిధ్యమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కోరిక.
- అనుకోకుండా 'భూతద్దం...' ఆడిషన్‌కు వెళ్లి హీరోయిన్‌గా ఎంపికయ్యాను. మా దర్శకుడు తను రాసుకున్న పాత్రకు నేను సరైన ఎంపిక అని భావించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు లక్ష్మి. తనో జర్నలిస్ట్. ఆధునిక భావాలున్న యువతిగా కనిపిస్తాను. కథ విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. సస్పెన్స్, థ్రిల్, రొమాన్స్ పాటలు... ఇలా అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి.

ఒక యోధుడి ప్రేమకథ



సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. దిశాపటానీ కీలకపాత్ర పోషించారు. దర్శక ద్వయం సాగర్ ఆంబ్రే, పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు. ధర్మ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే యూనిట్ ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'యోధ' ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా తెలుగు మీడియాతో ముచ్చటించారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ "'యోధ' యువతలో దేశ భక్తిని, ధైర్యాన్ని పెంపొందించే ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ సినిమాలో భాగమవ్వడమే ఒక అసాధారణ ప్రయాణం. ప్రేక్షకులను ఈ చిత్రం తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. రాశీ ఖన్నా మాట్లాడుతూ "'యోధ'లో పనిచేయడం ఒక ఉత్తేజకర అనుభవం. ధైర్యం, ప్రేమ కలబోతగా తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

కాన్సెప్ట్ మెప్పించింది



విరాన్ ముత్తంశెట్టి కథానాయకుడిగా వేణు మురళీధర్ వి. దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అయినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి మా చిత్రమే ఉదాహరణ. రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోంది' అని చెప్పారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'కొత్త కాన్సెప్ట్‌తో తీయడం వల్ల సినిమా ప్రేక్షకులకు చేరువైంది. తొలి చిత్రమే అయినా దర్శకుడు మంచి అవుట్‌పుట్ ఇచ్చారు' అని ప్రశంసించారు. 'ముఖ్య గమనిక'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు హీరోయిన్ ఆర్యన్ కృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

కృష్ణ నిర్యాణం నుంచి కల్కి అవతారం వరకు



దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ కథానాయకుడు కావడం, కమల్ హాసన్ ప్రతినాయకుడిగా కనిపించనుండడం సినిమాపై క్రేజ్‌ను పెంచాయి. ఇక ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు పొందిన నాగ్‌అశ్విన్ విజన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఊహకు అందని స్థాయిలో ఆయన 'కల్కి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ప్రచార చిత్రాలతోనే తెలుస్తోంది. ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 'కల్కి' కథకు సంబంధించిన విశేషాలను వివరించారు. 'మహాభారత గాథ, 'స్టార్ వార్స్' సినిమాలు నాకు చాలా ఇష్టం. ఈ రెండు విభిన్న ప్రపంచాలను కలుపుతూ ఓ సినిమా చేయాలనే ఆలోచనలోంచి 'కల్కి' చిత్రం పుట్టింది. ఈ సినిమా కథ మహాభారత కాలం నాటి శ్రీకృష్ణ నిర్యాణంతో మొదలై కల్కి అవతారం వరకూ సాగుతుంది. అందుకే టైటిల్ అలా పెట్టాం. మొత్తం ఆరు వేల సంవత్సరాల కథ ఇది. గతం నుంచి భవిష్యత్తులోకి చేసే ప్రయాణం. మున్ముందు ప్రపంచం ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేశాం. దానికోసం అద్భుతమైన ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. 'బ్లేడ్ రన్నర్' లాంటి హాలీవుడ్ చిత్రానికి అనుకరణగా అనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం సవాల్‌గా అనిపించింది. ఏఐ టెక్నాలజీ ఉపయోగించకుండా మా సృజనకు పదునుపెట్టి చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని చెప్పారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిశాపటానీ, దీపికా పదుకొనే కథానాయికలు. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.



'యువత, కందిరీగ' తదితర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అక్ష పర్దాసానీ ఓ ఇంటివారయ్యారు. తన స్నేహితుడు, సినిమాటోగ్రాఫర్ కౌశల్‌ను సోమవారం పెళ్లాడారు. ఆ ఫొటోలను అక్ష ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

అలరించే అమ్మపాట



విశ్వ కార్తిక్, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ సంయుక్తంగా నిర్మించారు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. సోమవారం దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా 'జో జో లాలీ అమ్మ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. పాట చాలా బావుందని యూనిట్‌ను ఆయన అభినందించారు.

గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూత



"చిట్టి ఆయీ హై", "ఔర్ ఆహిస్తా కీజియే బాతే" అంటూ మధురమైన గానంతో సంగీత ప్రియులను మైమరపించిన ఆ గొంతు మూగబోయింది. ప్రముఖ గజల్, నేపథ్య గాయకుడు పంకజ్ ఉధాస్ (72) ఇక లేరు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫరీదా, కూతుళ్లు రేవా, నయాబ్ ఉన్నారు. పంకజ్ ఉధాస్ మరణ వార్తను నయాబ్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. చాలా బరువైన హృదయంతో.. పద్మశ్రీ పంకజ్ ఉధాస్ కన్నుమూశారని తెలియజేయడానికి మేము చింతిస్తున్నామని ఆమె ప్రకటించారు. మంగళవారం పంకజ్ ఉధాస్ అంత్యక్రియలు జరగనున్నాయి. "నామ్", "సాజన్", "మొహ్రా" వంటి అనేక హిందీ చిత్రాలకు పంకజ్ ఉధాస్ గాత్రదానం చేశారు. పంకజ్ గుజరాత్‌లో సంగీత నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ తీగల వాయిద్యం దిల్రూబాను వాయించే వారు. ఆయన ఇద్దరు సోదరులు మన్హర్ ఉధాస్, నిర్మల్ ఉధాస్ కూడా గాయకులే. 1986లో విడుదలైన నామ్ చిత్రంలోని "చిట్టి ఆయీ హై" పాటతో ఆయన ప్రొఫెషనల్ సింగర్‌గా గుర్తింపు పొందారు. ఆ తర్వాత నుంచి ఆయన చాలా ఆల్బమ్‌లను రికార్డు చేశారు. 2006 సంవత్సరంలో భారత ప్రభుత్వం పంకజ్ ఉధాస్‌ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gI8Gctj లో చదవండి.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

ఇసుకను బొక్కేశారు.. అమరావతిని తొక్కేశారు

- మూడు ముక్కలాటతో రాష్ట్రానికి తీరని నష్టం..
- 1532వ రోజుకు చేరుకున్న రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్ళూరు , ఫిబ్రవరి 26: రాష్ట్రంలో ఇసుకను వైసీపీ నేతలు తెగ బొక్కేశారని, అందుకే ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబునల్) రూ.1908 కోట్లు జరిమానా విధించిందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. మూడు రాజధానులు వద్దు, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని, బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1532వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ మూడు రాజధానుల మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రానికి తీరని నష్టాన్ని మిగిల్చారన్నారు. అభివృద్ధిని విస్మరించి వనరులన్నింటినీ దోచుకుతిన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి విషయంపై ఉన్నత న్యాయ స్థానం తీర్పును లెక్కచేయని నియంత జగన్‌రెడ్డి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలన్నారు. నియంతృత్వం పోవాలంటే ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేసి అమరావతి వెలుగు కార్యక్రమం రాజధాని గ్రామాలలో కొనసాగించారు.

టీడీపీలోకి వైసీపీ నేత కళ్ళం హరినాధ్‌రెడ్డి

- కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన అధినేత చంద్రబాబు



హరినాధ్‌రెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు, పక్కన వేగేశన

బాపట్ల, ఫిబ్రవరి 26 : వైసీపీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది కళ్ళం హరినాధ్‌రెడ్డి సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద హరినాధ్‌రెడ్డికి టీడీపీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మ సేవాకార్యక్రమాలపై ఆసక్తితో హరినాధ్‌రెడ్డి టీడీపీలో చేరారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన రెండుసార్లు బాపట్ల ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు. రెడ్డి సామాజిక వర్గానికి ఎమ్మెల్యే కోన రఘుపతి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని పలుమార్లు ఆరోపణలు గుప్పించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బాపట్ల టిక్కెట్టును నరేంద్రవర్మకు ప్రకటించటంతో వైసీపీ స్థానిక నాయకుల విధానాలు నచ్చక ఆపార్టీని వీడి టీడీపీలో చేరినట్లు హరనాధ్‌రెడ్డి తెలిపారు. నరేంద్రవర్మ విజయానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

అర్ధరాత్రి ఘర్షణలపై

మూడు కేసులు

- ఇరు వర్గాలలోని 30 మందిపై నమోదు
- ఘర్షణకు కారణమైన వడ్డిముక్కల నాగభూషణంపై కేసు
- వడ్డిముక్కల గ్రామంలో పోలీస్ పికెటింగ్



కాల్వపై నడకదారికి అడ్డంగా నిర్మించిన కర్రల తడిక, ఫ్లెక్సీలు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి26: పరస్పర దాడులు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన సంఘటనలపై పొన్నూరు అర్బన్, రూరల్ పోలీసులు మూడు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి డీఎస్పీ రమేష్ తెలిపారు. పొన్నూరు పట్టణంలో అధికార వైసీపీలోని రెండు వర్గాలు ఆదివారం అర్ధరాత్రి పొన్నూరు పోలీస్‌స్టేషన్ సాక్షిగా పరస్పర దాడులకు తెగబడ్డారు. ఇరువర్గీయుల పరస్పర దాడుల నేపథ్యంలో ఒక్కొక్క వర్గంలోని 15 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే ఈ దాడులకు మూల కారకుడైన వడ్డిముక్కల గ్రామానికి చెందిన చింతకింద నాగభూషణంపై కేసు నమోదు చేసి రూల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలకు నేపథ్యం...

మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో గ్రామ ప్రధాన రహదారి వెంట చింతకింద నాగభూషణ రావు గృహం ఉంది. ఈ గృహం ముందు నుంచి మూడు అడుగుల వెడల్పుతో తమకు నడక దారి ఉందని, ఆ సమీపంలోనే నివాసం ఉంటున్న ముస్లింలు అంటున్నారు. అయితే నాగభూషణరావు ఆ స్థలం కూడా తనదేనంటూ, ఆవైపు నడకదారి లేకుండా మురుగు కాల్వపై అడ్డంగా కర్రలతో దడి ఏర్పాటుచేసి, ఆ దడికి వైసీపీ ఫ్లెక్సీలను కట్టి మురుగు కాల్వను పూడ్చివేసాడు. ఈసందర్భంగా ఏర్పడిన వివాదంతో నాగభూషణరావు తమను మతపరంగానూ, వ్యక్తిగతంగానూ దూషించాడని స్థానిక ముస్లిం మహిళలు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వడ్డిముక్కల ముస్లింలు అంజుమన్ కమిటి అధ్యక్షుడు, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అనుచరుడు షేక్ మహ్మద్ అలియాజ్ మామూ, వైసీపీలో అసమతి వర్గనేతగా ముద్రపడిన మైనార్టీ నేత షేక్ నాజర్‌లు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో అసలు విషయం పక్కదారిపట్టి, కొసరు విషయం (వైసీపీలో గ్రూపు తగాదాలు) వచ్చి చేరింది. దీంతో వివాదం ముదిరింది. నాజర్, మామూల వర్గీయులు పోలీస్‌స్టేషన్ సాక్షిగా బాహాబాహీ ఘర్షణకు దిగారు. ఇరువర్గాలకు చెందిన వందలాది మంది అక్కడకు చేరుకొని కర్రలు, రాళ్ల గాజు సీసాలు విసురుకోవటంతో పలువురికి గాయాలయ్యాయి. ఆ సమయంలో పలువురు పోలీసులకు సైతం దాడులకు గురికావల్సి వచ్చింది. పరిస్తితి చేయిదాటిపోవటంతో తెనాలి డీఎస్పీ రంగంలోకి దిగి అదనపు పోలీస్‌సిబ్బందిని రప్పించి పరిస్థితిని అదుపుచేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే పోలీస్ స్టేషన్ సాక్షిగా, పోలీసుల సమక్షంలో అధికార వైసీపీలోని రెండు వర్గాల వారు కర్రలు, సీసాలతో ఘర్షణకు దిగడం శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల వైఫల్యాన్ని తేటతెల్లం చేసింది.

గ్రామంలో పోలీస్ పికెటింగ్..

స్వల్ప వివాదం నేపథ్యంలో తీవ్ర ఉధృత్తలకు దారితీసిన వడ్డిముక్కల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి రూరల్ ఎస్ఐ బీ. భార్గవ్ నేతృత్వంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసారు. గ్రామంలోకి బయట వ్యక్తుల సంచారంపై నిఘా పెట్టారు.

జగన్.. అసమర్ధ సీఎం

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు



సభలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు, వేదికపై కన్నా, వైవీ

సత్తెనపల్లి ఫిబ్రవరి 26: పరిపాలన చేతకాని అసమర్ధ సీఎం జగన్ అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శించారు. సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం 'నవ్యాంధ్ర రాష్ట్రం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఆయన నవ్యాంధ్ర రాష్ట్రం పుస్తకాన్ని ఆనందబాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఆయనపై ఉన్న కేసుల నుంచి తప్పించుకోవడానికి, ఆస్తులను కూడబెట్టుకోవడానికి తన అధికారాన్ని, ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతినే రాజధానిగా ఒప్పుకున్న జగన్, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. పోలవరం అభివృద్ధిని చంద్రబాబునాయుడు 72శాతం పూర్తి చేస్తే జగన్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించాడన్నారు. మద్య నిషేధం హామీని అమలు చేయడంలో విఫలమయ్యాడన్నారు. సైకో జగన్‌ను రాష్ట్రం నుండి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కన్నా లక్ష్మీనారాయణను సత్తెనపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీఎంజగన్ అన్నివర్గాల ప్రజలను దారుణంగా మోసం చేశాడన్నారు. నవరత్నాలు, సంక్షేమం ముసుగులో రాష్ట్రాన్ని దోచుకున్నాడన్నారు. సైకో జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, అంకాళ్ళ ప్రభుదాసు, తురకా మేరిగ్రేస్, యెలినేడి లక్ష్మీ తులసీ, నాగరాజు, సాంబయ్య, రామచంద్రరావు, ఆశీ ర్వాదం, దత్తాత్రేయులు, అబ్దుల నబీ తదితరులు పాల్గొన్నారు.

యువతను రోడ్డుపాలు చేసిన జగన్‌రెడ్డి

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు
- యువతతో 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్'



యువ ఓటర్లతో ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన నేత రాజా రమేష్

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 26 : ఒక్క ఛాన్స్ అన్న మాట నమ్మిన పాపానికి యువతను రోడ్డున పడేసిన ఘనుడు సీఎం జగన్ అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ అమలు చేయలేని హామీలు ఇచ్చి యువత ఓట్లు కొల్లగొట్టి మోసం చేశారని ఆయన మండి పడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిరుద్యోగ భృతితో పాటు రకరకాల హామీలు ఇచ్చి జగన్ మోసం చేశాడని, అందుకే ఈ సారి రాష్ట్రంలో యువత తొలిసారిగా వేసే ఓటు దేశ, రాష్ట్రగతిని మార్చేదిగా ఉండాలన్నారు. మంగళవారం పట్టణంలోని పత్తిపాటి గార్డెన్‌లో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్' కార్యక్రమానికి మాజీ మంత్రి ప్రత్తిపాటితో పాటు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు తేజశ్విని పొడపాటి, జనసేన నేత తోట రాజారమేష్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా తేజశ్విని మాట్లాడుతూ 2024 ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు చాలా కీలకం అన్నారు. ఆ దృష్ట్యా అన్ని రంగాలకు చెందిన ప్రొఫెషనల్ యువతతో పాటు ప్రతి ఒక్కరు రాష్ట్రాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రాజా రమేష్ మాట్లాడుతూ భవిష్యత్‌లో తమకు ఎవరు ఉన్నత భవిష్యత్ కల్పిస్తారు? ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు? అనే విషయాలను యువత ఆలోచించాలన్నారు. గత ఎన్నికల్లో జగన్ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మించి యువతను మోసంచేశారన్నారు. జగన్‌పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రాలేదని, గంజాయి మాత్రం దేశం మొత్తం ఎగుమతి చేస్తున్నారని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తొలిసారి ఓటు వచ్చిన యువత పాల్గొన్నారు.

భారత జాతీయ ప్రమాణాలపై

గ్రామ సర్పంచ్‌లకు వర్క్‌షాప్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 27: భారతదేశ జాతీయ ప్రమాణాల సంస్థ (బ్యూరో ఇండియన్ స్టాండర్డ్స్)ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు దఫాలుగా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి మార్చి 1 వరకు, మార్చి 4 నుంచి 7 వరకు రోజుకు వర్క్‌షాప్ జరగనుంది. వివిధ ఉత్పత్తులపై భారతీయ ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ఈవర్క్‌షాప్ ఏర్పాటుచేయనున్నారు. గుంటూరు జిల్లా వారికి గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో, పల్నాడు జిల్లాకు చెందినవారికి నరసరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో, బాపట్లజిల్లాకు చెందిన వారికి అక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఈ వర్క్ షాప్ జరగనుంది.



ఏపీ భవన్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న పాపారావు

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- ఏపీ భవన్ వద్ద బాపట్లవాసి నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రత్యేక హోదా ఇవ్వాలని బాపట్లు వాసి పాపారావు డిమాండ్ చేశారు. సోమవారం, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీ భవన్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆయన నిరసన తెలిపారు. రైతు భరోసా ,వెల్ నెస్ సెంటర్ల కాంట్రాక్ట్ నిర్మాణం పనులు చేపట్టినప్పటికీ జగన్ సర్కారు తనకు నిధులు విడుదల చేయలేదన్నారు. దాదాపు రూ.25 లక్షల మేర డబ్బులు రావాల్సి ఉందన్నారు. గత ఎన్నికలలో జగన్‌కు ఓటు వేశానని.. ఇప్పుడు మాత్రం ఓటు వేయబోనని పాపారావు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

టీడీపీ, జనసేన సీట్ల ప్రకటనతో

వైసీపీకి వెన్నులో వణుకు

- ఓటమి భయంతో మంత్రుల అవాకులు చెవాకులు
- జనసేనాని ఆదేశాలను శిరసావహించేందుకు సిద్ధం
- ధ్వజమెత్తిన జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి 26: టీడీపీ, జనసేన కూటమి సీట్ల ప్రకటన చూసి వైసీపీ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే మంత్రులు అవాకులు, చెవాకులు పేలుతున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో గ్రావెల్, మట్టి మాఫియా చేసుకోవడానికే అంబటి రాంబాబుకు మంత్రి పదవి ఇచ్చినట్లు ఉందని గాదె దుయ్యబట్టారు. నియోజకవర్గంలో అంబటి ఓట్లు అడగానికి వెడితే.. ఆడవాళ్లు చెప్పులతో కొడతారని ఆయన ధ్వజమెత్తారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం వదిలి వేరే నియోజకవర్గానికి పారిపోయిన చెల్లని నాణెం లాంటి చెల్లుబోయిన వేణుగోపాల్ కూడా జనసేన, టీడీపీ కూటమిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మహా జనానికి మరదలు పిల్ల వంటి మంత్రి రోజాకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ దొరకడం కూడా కష్టమేనని, ముందు తన ఉనికిని ఆమె కాపాడుకోవాలని గాదె హితవుపలికారు. జనసేనాని పవన్ కల్యాణ్ ఇచ్చే ఎటువంటి ఆదేశాలనైనా క్రమశిక్షణతో పాటించేందుకు జనసైనికులు, వీరమహిళలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు శిఖా బాలు, బిట్రగుంట మల్లిక, చట్టాల త్రినాధ్, చింత శివ, గోపిశెట్టి సాయి, యర్రంశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

అరాచకత్వం రాజ్యమేలుతోంది

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్
- వైసీపీ దాడిలో గాయపడిన బాధితుడికి పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న సత్యకుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26 : ఆంధ్రప్రదేశ్‌లో ఆరాచక పరిస్థితి రాజ్యమేలుతోందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. ఇటీవల నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెంలో వైసీపీ దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణను సోమవారం స్థానిక బీజేపీ నేతలతో కలసి సత్యకుమార్ పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగిశెట్టి రామకృష్ణ బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం ప్రచారంలో ఉండగా వైసీపీ రౌడీమూక వెంకటప్పారెడ్డి, జయబారత్‌రెడ్డిలు బీజేపీ నేతలపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. కేసు రిజిస్టర్ చేయకపోతే సీఎం ఇంటిని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు, బీజేపీ నేతలు డాక్టర్ ఎన్. వెంకటరావు, కృపారావు, ఆదినారాయణ, హనుమంతురావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

ఎమ్మెల్యే కిలారికి ధూళిపాళ్ళ లీగల్ నోటీస్..

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 26: ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం లీగల్ నోటీస్‌ను పంపించారు. 2019 అసెంబ్లీ ఎన్నికలో పరాజయం పాలైన సందర్భంలో నరేంద్ర కుమార్ కాపు సామాజిక వర్గంపై అనుచిత వాఖ్యలు చేసారని తీవ్ర వెల్లలూరు గ్రామంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆరోపించారు. తనపై నిరాధార ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే కిలారికి నరేంద్ర కుమార్ తన న్యాయవాది ద్వారా పరువు నష్టం నోటీస్‌ను పంపించారు. కాపు కులస్తుల మనోభావాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ఎమ్మెల్యే కిలారి ప్రయత్నిస్తున్నారన్ని లీగల్ నోటీస్‌లో నరేంద్రకుమార్ పేర్కొన్నారు. వారంరోజులో ఈ విషయమై బహిరంగ క్షమాపణ ప్రకటించి రూ. కోటి నష్టపరిహారంగా చెల్లించని పక్షంలో కోర్టులో కేసు దాఖలుచేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని నరేంద్రకుమార్ నోటీసులో హెచ్చరించారు.



తిరునాళ్ళకు సంబంధించి పలు సూచనలు చేస్తున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

కోటప్పకొండ తిరునాళ్లకు సిద్ధం

- త్రికోటేశ్వరుని దర్శించుకున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 26 : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ళకు పోలీసు అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకరరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆయన కోటప్పకొండ పరిసరాలను పరిశీలించి తిరునాళ్ళ ఏర్పాట్లకు సంబందించి తగు సూచనలు చేశారు.వాహనాల రాకపోకలు, పార్కింగ్, భక్తుల కోసం క్యూ ఏర్పాటు, ప్రభలు నిలిపే ప్రదేశాలు తదితర వాటికి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. గత సంవత్సరం తిరునాళ్ళ సమయంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య తలెత్తితే దానికి కారణం తెలుసుకొని ఈ సంవత్సరం ఆ విధ మైన సమస్య ఉత్పన్న మవ్వకుండా చూడాలన్నారు. రోడ్లు భవనాలశాఖ సమన్వయంతో రోడ్లు వెడల్పు చేయించటం, రోడ్డు మార్గాల్లో అవాంతరాలు ఉంటే తొలగించటం, చిన్న చిన్ని బ్రిడ్జీలు, కల్వర్టులను బాగు చేయించటం తదితర పనులు చేయించాలని సూచించారు. ఆలయ అధికారులతో మాట్లాడి కొండ పైన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడిచుట్టూ ఫెన్సింగ్ వేయించాలన్నారు. ప్రభలు నిలిపే ప్రదేశాలు పరిశీలించి అక్కడ ఎటువంటి అవాంతరాలు ఎదురవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ రామచంద్రరాజు, నరసరావుపేట డీఎస్పీ వర్మ, ఎస్‌బీ సీఐలు ప్రభాకర్, బాల నాగిరెడ్డి, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రోశయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన అనంతరం బ్రోచర్ ఆవిష్కరణ చేస్తున్న వర్సిటీ ప్రతినిధులు

సార్వత్రిక మానవత్వాన్ని పెంపొందించాలి

- ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిలియన్ డూలె
- ఏఎన్‌యూలో ప్రారంభమైన మూడు రోజుల గ్లోబల్ సదస్సు

పెదకాకాని, ఫిబ్రవరి 26 ప్రతి ఒక్కరిలో మానవతా విలువలు పెంపొందించుకునేలా సార్వత్రిక మానవత్వాన్ని చూపాలని ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్. జిలియన్ డూలే అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో 'మార్జినాలిటీ మల్టీకల్చరల్ లెటర్ నేటివ్ ఆస్ట్రేలియా అండ్ ఇండియా' అనే అంశంపై మూడు రోజుల గ్లోబల్ సదస్సు సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి సదస్సు డైరెక్టర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య పీ.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న ప్రొఫెసర్ డూలే మాట్లాడుతూ సమాజంలో విద్వేషాలు, మారణకాండలు, జాతిపరంగా అనేక హింసలు జరుగుతున్నాయని, వాటిని తొలగించి మానవత్వాన్ని చూపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అణగదొక్కబడేవారు వెనుకబాటుతనంలోనే ఉంటున్నారని, మానవులంతా సమానమే అన్న రీతిలో వారికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరు గుర్తెరగాలన్నారు. అమెరికాలోని ఈస్ట్ కరోలైన యూనివర్సిటీ ప్రొఫెసర్ సియోడియల్ ఫ్రాంక్‌హెచ్.డీన మాట్లాడుతూ బహుళ సాంస్కృతిక సమ్మిళిత సమాజాన్ని పెంపొందించడానికి సంగీతం, నృత్యం కీలకపాత్ర పోషిస్తాయని వాటిల్లోకి నేడు క్రీడలు చేరాయన్నారు. ఉన్నతులు, బలహీన వర్గాల వారిని చేరదీయాలే గాని ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. వీసీ పీ. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రతి దేశంలో ఏదో ఒక ప్రాంతంలో అణగారిన వారు అణగదొక్కబడుతూనే ఉన్నారన్నారు. దీనికి కారణం అతి కొద్ది మంది చేతుల్లో అధికారం, సంపద ఉండటమేనన్నారు. అంతర్గతంగా ఉన్న బలమైన వర్గం నుంచి ఎదురవుతున్న వివక్ష అధికంగా ఉంటుందని అన్నారు. మరొక వక్తగా పాల్గొన్న కలకత్తాలోని యూనివర్సిటీ ఆఫ్ బుర్ద్వాన్ నుంచివచ్చిన ప్రొఫెసర్ ప్రొఫెసర్ అంగ్షుమాన్ కర్ మాట్లాడుతూ ఆస్ట్రేలియా అధ్యయనాల పరిధిని విస్తృతం చేసేలా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ చేస్తున్న పరిశోధనలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ.కరుణ, ఇంగ్లీష్ విభాగాధిపతి ప్రొఫెసర్ జీ.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

కేసులో రాజీ పడనందున వ్యక్తి హత్య

- నిందితులను శిక్షించాలని దళిత సంఘాల ఆందోళన



సాంబశివరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు

కొల్లిపర, ఫిబ్రవరి 26 : పాత కేసు విషయంలో రాజీ పడనందున ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన నాలాది సాంబశివరావు (35)కు అదే గ్రామానికి చెందిన సమ్మెట అంజనేయులు కుటుంబ సభ్యుల మధ్య పాత కేసులు ఉండటంతో పాటు కోర్టులో విచారణ జరుగుతుంది. ఈ కేసు విషయంలో సాంబశివరావు రాజీకి రావటంలేదని మనస్సులో పెట్టుకుని సోమవారం తెల్లవారు జామున సమ్మెట అంజనేయులు అతని భార్య భూలక్ష్మి, మరొక వ్యక్తి చాగంటి శేఖర్‌రెడ్డి కలిసి హత్య చేసినట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. సాంబశివరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని విచారణచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాంబశివరావును హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దావులూరు అడ్డరోడ్డు సెంటర్‌లో దళిత సంఘాల నేతలు బడ్డికొట్టును తగలబెట్టి ఆందోళన చేశారు. డీఎస్పీ రమేష్ నిందితులను తొందరలోనే అరెస్టు చేస్తామని హామీ ఇవ్వటంతో వారు ఆందోళనను విరమించారు.

1,42,382 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,59,820 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా, 1,42,382 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,03,060 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లుపేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	13800	19000
273	12500	16000
341	11000	20500
4884	12000	15000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10000	20000
దేవనూరు డీలక్స్	12000	19500
తెల్లకాయలు	5000	13000

భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాలి

● టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



ఇనిమెట్లలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి 26: రాష్ట్రంలోని ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని కొండమోడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందన్నారు. ప్రజలకు రక్షణ, ఉపాధి లేకపోవడంతో చాలా మంది వేరే ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఎంపిక కావటంతో స్థానిక టీడీపీ నాయకత్వం కొండమోడు ప్రాంతా న్ని పసుపుమయం చేసింది. కన్నా రాకను గమనించిన స్థానిక టీడీపీ నాయకత్వం ఎదురు వెళ్లి భారీ గజమాలతో, హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య, తెలుగు మహిళ అధ్యక్షురాలు నెల్లూరి అహల్యారాణి, ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

● మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో మహాలక్ష్మీ పోతురాజుల నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కొండ్రకుంట రంగారావు, పారా పద్మారావు, గడేమ వెంకట్రావు, జవహర్, కొండ్రకుంట సర్వేశ్వరరావు తదితరులున్నారు.

అన్ని విధాల అండగా ఉంటా

సత్తెనపల్లి ఫిబ్రవరి 26: వైసీపీని వీడి టీడీపీలో చేరిన యువతకు అన్ని విధాల అండగా ఉంటానని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఎస్‌కే మహ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో 100మంది యువత సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యెలినేడి రామస్వామిలు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాంబోభుడే, పోట్ల ఆంజనేయులు, నూర్‌బాషా జానీబాబు, బండారు నాగరాజు తదితరులున్నారు.

మేదరమెట్ల 'సిద్ధం' సభను జయప్రదం చేయాలి

● వైసీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్

మాచర్ల, ఫిబ్రవరి 26: బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్లలో మార్చి 3వ తేదీన జరగనున్న 'సిద్ధం' సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలబోయిన అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. పట్టణంలోని సాగర్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీమీనాక్షి సుందరేశ్వరస్వామి కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. జగనన్న మళ్లీ వస్తేనే రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగుతుందనే భావన ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల్లో నెలకొందన్నారు. వైసీపీ చరిత్రలో మేదరమెట్ల సిద్ధం సభ ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, బ్రాహ్మణ సంఘ నేతలు శ్రీనివాసశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతురావు, నాగరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గురజాల అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26: గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి అంతా వైసీపీ హయాంలోనే జరిగిందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, వైసీపీ నరసరావుపేట నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు పాల్గొని పిడుగు రాళ్ల బైపాస్ రహదారిని ప్రారంభించారు.

బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారమే జగన్ లక్ష్యం

మాచవరం, ఫిబ్రవరి 26: మండలంలోని పిన్నెల్లి గ్రామంలో మండల వైసీపీ కన్వీనర్ చౌదరి సింగరయ్య అధ్యక్షతన వైసీపీ ఎన్నికల బహిరంగసభ జరిగింది. ఈ సభకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో పలురకాల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు.



మాచర్లలో కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పీఆర్కే, కోన రఘుపతి

పుస్తకాలు చదవడం ద్వారా ప్రజల్లో చైతన్యం రావాలి

● నవ్యాంధ్ర రాష్ట్రం పుస్తకం ఆవిష్కరణ
● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు



నవ్యాంధ్ర రాష్ట్రం పుస్తకాన్ని ఆవిష్కరించిన కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, వైవీ ఆంజనేయులు, మన్నవ శారదాదేవి తదితరులు

సత్తెనపల్లి ఫిబ్రవరి 26: పుస్తకాలు చదవడం ద్వారా ప్రజల్లో చైతన్యం రావాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం తెలుగు మహిళ నాయకురాలు మన్నవ శారదాదేవి రచించిన నవ్యాంధ్ర రాష్ట్రంలో బాబు రావాలి- బాగుచేయాలి, రాష్ట్ర భవిష్యత్తు మారాలి అనే పుస్తకాన్ని నక్కా ఆనందబాబు, కన్నా లక్ష్మీనారాయణ మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, బిల్డర్ చిగురుపాటి సాంబశివరావు, మన్నవ శారదాదేవి తదితరులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నక్కా ఆనందబాబు మాట్లాడుతూ 2014 నుంచి 19 వరకూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో నవ్యాంధ్ర రాష్ట్రంను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రయత్నించారన్నారు. 2019లో ఒక్కచాన్స్ పేరుతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కు వెళ్లిందని పుస్తకంలో శారదాదేవి రాసిందన్నారు. పుస్తకాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రం మరలా అభివృద్ధి చెందాలంటే రాష్ట్రానికి బాబు రావాలి - బాగుచేయాలి, మన రాష్ట్ర భవిష్యత్తు మారాలి అనే నినాదాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్ళాలన్నారు. బాబు వస్తేనే మన రాష్ట్రం బాగుపడుతుందని అందరికీ చెప్పాలన్నారు. పుస్తక రచయిత మన్నవ శారద మాట్లాడుతూ అమరావతి రైతుల ఉద్యమం నుంచి తాను వెలుగులోకి వచ్చానని గతంలో జగన్ రాష్ట్రానికి ఎందుకు వద్దు అని ఒక పుస్తకం రాశానని ఇప్పుడు నవ్యాంధ్ర రాష్ట్రం కోసం చంద్రబాబు అవసరం ఏంటనే పుస్తకాన్ని రాశానన్నారు. కన్నా ఆమోదంతో రచించిన పుస్తకాన్ని 10000 కాపీలను ముద్రించేందుకు బిల్డర్ చిగురుపాటి సాంబశివరావు సహకరించారన్నారు. ఈ సందర్భంగా శారదాదేవిని నక్కా ఆనందబాబు, కన్నా, వైవీ ఆంజనేయులు తదితరులు సన్మానించి అభినందించారు. చిగురుపాటి సాంబశివరావును కూడా సన్మానించారు. కార్యకర్తలకు నాయకులకు, అభిమానులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, చౌట శ్రీనివాసరావు, కటకం రామకృష్ణ, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, నాదెండ్ల సత్యనారాయణ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తుమ్మకోట నేతల కృషిని మరువలేను

● ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బ్రహ్మారెడ్డి



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డికి హారతులిస్తున్న తుమ్మకోట మహిళలు

రెంటచింతల, ఫిబ్రవరి 26: అర్థబలం లేని తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి సముచిత స్థానం కల్పించిన మాజీ సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానని రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం జనసేనతో ఐక్యంగా వ్యవహరించి విజయదుందుభి మోగించడానికి కృషి చేద్దామని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. ఆదివారం రాత్రి తుమ్మకోటలో మూడు గంటల పాటు పర్యటించి ఆంబోతు సేవానాయక్, షేక్ జానీ భాష ఇంట జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. గిరిజన మహిళల మంగళహారతులతో నుదుట తిలకం దిద్ది సాదరంగా తమ గృహాల్లోకి ఆహ్వానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 1999 ఎన్నికల్లో మా అమ్మ దుర్గాంబ పోటీచేసినప్పుడు గెలుపు కోసం గ్రామస్థులు చేసిన కృషిని ఎన్నటికి(అక్టోబర్ 5న పోలీసు కాల్పులు) మరులేనన్నారు. అందుకనే తుమ్మకోట నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ జనసేన ప్రభంజనం వీస్తుందని ప్రతి సర్వే ఫలితాలు కూడా కూటమికే అనుకూలంగా ఉన్నాయన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కర్ని గుర్తు పెట్టుకుని సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ లింగా పున్నారావు, కుర్రి శివారెడ్డి, నరశింహారావు, సతీష్, మాధవరావు, అంకారావు, వెంకటేష్, మీరా, వెంకట రామారావు, వెంకటేశ్వర్లు, పోట్ల సైదారావు, యోహాన్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులంతా కలసి మెలసి జీవించాలి

● కొమ్మాలపాటి మాధవీలత



వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాధవీలత

బెల్లంకొండ, ఫిబ్రవరి 26: గ్రామస్థులంతా పార్టీలకు అతీతంగా పాడి పంటలతో కలసి మెలసి సంతోషంగా జీవించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సతీమణి మాధవీలత తెలిపారు. సోమవారం ఉదయం బెల్లంకొండలో వెంకటేశ్వర స్వామి దేవాలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్లంకొండకొండపై నూతన ఆలయాన్ని నిర్మించటం గర్వించదగ్గ విషయం అన్నారు. అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చానన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్టీకి పూర్వ వైభవం తేవాలి

తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తేవాలని మాజీ ఎమ్మెల్యే సతీమణి మాధవీలత అన్నారు. సోమవారం బెల్లంకొండలో ఒక కార్యక్రమానికి హాజరై అనంతరం కొంత సేపు కార్యకర్తలతో చర్చించారు. బెల్లంకొండ మండలం తెలుగుదేశం పార్టీకి మంచి పట్టు ఉన్న మండలం అని, అందరూ కలసికట్టుగా పార్టీ అభివృద్ధికి, విజయానికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా, ముందుగా స్పందించి కార్యకర్తలకు సహాయ సహకారాలను అందించే వ్యక్తి కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలి పించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు, గుడిసె కొండయ్య, సలాం, సయ్యద్ జబ్బార్, పీఎస్‌కే రసూల్, పిచ్చయ్య, ఉప సర్పంచ్ సుభానీ, సయ్యద్ జానీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

● రూ.12.33 కోట్ల నిధులు మంజూరు

క్రోసూరు, ఫిబ్రవరి 26: మండలంలోని పలు గ్రామాలకు వెళ్ళే రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. దొడ్లేరు నుంచి హసానాబాద్, నాగవరం మీదుగా రెడ్డిగూడెం వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.6.30 కోట్లు, 88 తాళ్ళూరు నుంచి ఉయ్యందన, అనంతవరం మీదుగా పెదపాలెం వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.6.03 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. నాబార్డు నిధులతో నిర్మాణం కానున్న ఈ రహదారులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

'సిద్ధం' సభకు సంసిద్ధం కావాలి : ఎమ్మెల్యే శంకరరావు

బెల్లంకొండ, ఫిబ్రవరి 26: మార్చి 3వ తేదీన మేదరమెట్ల వద్ద జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సిద్ధం సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం బెల్లంకొండ మండలంలోని చండ్రాజుపాలెం గ్రామంలో మండల వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

దుర్గి, ఫిబ్రవరి 26: మండలంలోని ముటుకూరు ఎస్సీ కాలనీలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ కోరారు. సైడు కాలువల్లో పూడిక తీయించాలని, చెత్తాచెదారం తొలగించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, సైడు కాలువలు నిర్మించాలన్నారు. ఈ మేరకు సోమవారం దుర్గి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీని అందించారు.

దుర్గిలో డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు

దుర్గి, ఫిబ్రవర 26: దుర్గిలో ఆదివారం రాత్రి పునీత జోజప్ప వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరిపి బహుమతులు అందించారు. ముందుగా మహోత్సవాల్లో భాగంగా గ్రామంలో తేరు ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్ జక్కా అనిల్‌కుమార్, యెల్లెబోయిన గోపాల్, సింగు రవి, సుబ్బారావు, రామకృష్ణ, గ్రెగోపాల్, జక్కా బాజిబాబు, చందు రాథోడ్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

గురజాలటౌన్, ఫిబ్రవరి 26: నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో సదరు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సమాధానంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన మహంకాళి ఏసు రాజు (42) రెండు ట్రాక్టర్లకు యజమానిగా ఉన్నారు. కొద్ది రోజులుగా సమాధానంపేట - గొట్టిముక్కల మధ్యలో పూడిపోయిన కుంటలో ఉన్న మట్టిని రైతులకు తరలిచేందుకు ఒప్పందం కుదుర్చుకొని ట్రాక్టర్లను నడుపుతున్నారు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో డ్రైవర్లకు అన్నం, నీటిని తీసుకొచ్చి కుంటకు దూరంగా నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ట్రాక్టర్‌లో ఉన్న మట్టిని అజర్ అనే వ్యక్తి అన్‌లోడు చేసివస్తూ నిద్రిస్తూ ఉన్న ఏసురాజు కాళ్లు, నడుముపై నుంచి ట్రాక్టర్‌ను పోనిచ్చాడు. తీవ్ర గాయాలపాలైన ఏసురాజును 108 వాహనంలో పట్టంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం



కరపత్రాలను విడుదల చేస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్లు

కారంపూడి, ఫిబ్రవరి 26: కారంపూడిలో సోమవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ బొమ్మిన అల్లయ్య సావిత్రి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం రాంప్రసాద్, మేనేజర్ భాస్కర్, సీజీజీబీ మేనేజర్ కొండారెడ్డి, ఏడుకొండలు, ఏపీఎం వెలుగు శివకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించాలి

● మార్కాపురం డీఎఫ్‌వో విగ్నేష్ అప్పావు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 26: విద్యార్థినులు ఇష్టపడి చదివి రానున్న పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని మార్కాపురం డీఎఫ్‌వో విగ్నేష్ అప్పావు ఆకాంక్షించారు. సోమవారం మాచర్ల మండలం ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. ప్రిన్సిపాల్ దుర్గా భవాని, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అప్పావును దుశ్శాలువలతో సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ, సెక్షన్ ఆఫీ సర్ వెంకట్రావు, బీట్ ఆఫీసర్ అబ్దుల్లా, వార్డెన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై 28న సమావేశం

రెంటచింతల, ఫిబ్రవరి 26: కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో ఈ నెల 28న శివరాత్రి ఏర్పాట్లపై 10శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్ రామ్మోహనరావు చెప్పారు. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ బి.బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రతి శాఖకు చెందిన అధికారులు ప్రజాప్రతినిధులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

ప్రైవేట్ బడుల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

రెంటచింతల, ఫిబ్రవరి 26: విద్యాహక్కు చట్టం కింద 2024-25 సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత విద్య కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో-2 శివనాగేశ్వరరావు కోరారు. ఒకటో తరగతికి సంబంధించిన దరఖాస్తులను మార్చి 14లోపు సమర్పించవచ్చన్నారు.

తురకపాలెంలో స్కూటీ దహనం

నకరికల్లు, ఫిబ్రవరి 26: మండలంలోని తురకపాలెంలో పలం టీరుగా పని చేస్తున్న గ్రామానికి చెందిన చల్లా బాలకృష్ణ స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చల్లా బాల కృష్ణకు చెందిన స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు తగల బెట్టినట్టు ఫిర్యాదు చేయగా ఎస్ఐ పీ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాట తప్పి మడమ తిప్పిన జగన్

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 26: మద్యం నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న హామీపై జగన్ మాట తప్పి మడమ తిప్పాడని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం రేట్లను మూడు రెట్లు పెంచారని, 57 నెలల పాలనలో సుమారు రెండు లక్షల కోట్ల నాసిరకం మద్యం అమ్మి వాటి ద్వారా సమకూర్చిన లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు తీసుకెళ్లారన్నారు. నాసిరకం మద్యం తాగిన వారిలో సుమారు 35 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని ఆస్పత్రుల పాలయ్యారని, అందులో 30వేల మంది ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. నాసిరకం మద్యం, గంజాయి, డ్రగ్స్ బారినపడి యువత నిర్వీర్య మవుతున్నారని, వీటి వల్ల రాష్ట్రంలో అత్యాచారాలు, నేరాలు పెరిగి పోయాయన్నారు. రాబోయే 15 సంవత్సరాల్లో మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి రూ.40వేల కోట్లు అప్పు తీసుకు వచ్చి తాడేపల్లి ప్యాలెస్ లో దాచుకున్నారన్నారు. రాష్ట్రంలో నాలుగు లక్షల బెల్టు షాపులు, మొబైల్ పెట్టించి ప్రజల రక్త మాంసాలతో మద్యం వ్యాపారం చేస్తున్నారన్నారు. మద్యం షాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే చేస్తున్నారని, డిజిటల్ పేమెంట్స్ ఎందుకు అనుమ తించటం లేదని?, అవినీతి కోసమే నగదు పేమెంట్ చేస్తున్నారన్నారు. మద్యం అక్రమ వ్యాపారం మొత్తం జగన్, పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతుందని, మద్యం మహమ్మారికి వీరే బాధ్యులన్నారు. ఈ నాసిరకం మద్యంలో జగన్ లక్ష కోట్లు కమిషన్ కొట్టేశారని, వేల కోట్ల రూపాయలు వైసీపీ నేతలు కొట్టేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని, ఇందుకు ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

చంద్రబాబుపై నమ్మకంతో టీడీపీని గెలిపించుకుందాం

● భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పార్టీ నాయకులు



బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో టీడీపీ నేతలు

రెంటచింతల, ఫిబ్రవరి 26: రానున్న 50 రోజులు పార్టీ కోసం కష్టపడి మాజీ సీఎం చంద్రబాబుపై నమ్మకంతో టీడీపీని గెలిపించుకుందామని టీడీపీ నేతలు అన్నారు. రెంటచింతలలోని ఆంజనేయమాన్యంలో టీడీపీ నేతలు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలనేదే చంద్రబాబు ధ్యేయమన్నారు. రానున్న రోజుల్లో బ్రహ్మారెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.సుమంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు, బోడపాటి రామకృష్ణ, మాన్యం శ్రీను, సిద్ధయ్య, రవి, దానయ్య, థామస్, అప్పయ్య, మునినాయక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో జీవించాలి : ఎమ్మెల్యే పీఆర్కే

వెల్దుర్తి, ఫిబ్రవరి 26: ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని బోదలవీడులో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం, రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 26: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పట్టణంలోని రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు సోమవారం ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గుమ్మడి కోటేశ్వరరావు, నాసరయ్య, డీఈఈ దినేష్‌రెడ్డి, రైల్వే స్టేషన్ మాస్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇమాంసాహెబ్‌కు నివాళి

మాచర్ల, ఫిబ్రవరి 26: పట్టణంలోని 29వ వార్డుకు చెందిన షేక్ ఇమాంసాహెబ్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వార్డుకు చేరుకొని ఇమాంసాహెబ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

బైజూస్ ట్యాబ్స్ ద్వారా విద్యార్థులకు బోధన

● పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు బీ లింగేశ్వరరెడ్డి

నకరికల్లు, ఫిబ్రవరి 26: విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ ద్వారా విద్యను బోధించాలని పాఠశాల విద్యా సంయుక్త సంచాలకులు బీ లింగేశ్వరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను ఉపయోగించి బోధన చేయాలని ఉపాధ్యాయుల కు ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పాటు నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కే వేణుగోపాలరావు ఉన్నారు. హెచ్‌ఎం, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తిరుపతమ్మ గోపయ్యల కల్యాణం



మాదినపాడులో లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు

దాచేపల్లి, ఫిబ్రవరి 26: లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం దాచేపల్లి మండలం మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం గ్రామాల్లో స్వామివారి కల్యాణం భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ జానపాటి సీతారామశర్మ వేద మంత్రోచ్చరణల మధ్య గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పరిసరాలను శుభ్రం చేసిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న కాకతీయ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెదకూరపాడు, ఫిబ్రవరి 26: మండలంలోని రామాపురంలో పెదకూరపాడు కాకతీయ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) యూనిట్ విద్యార్థులు రామాపురంలోని పలు వీధులను శుభ్రం చేశారు. మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా శుభ్ర పరిచి గ్రామస్థులకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వివిధ రకాల వ్యాధులు సక్రమించే అవకాశం ఉందని వివరించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏసమ్మ, కోటయ్య, రవి, హెచ్‌ఎం జోస్ఫీనమ్మ, శీలంనేని సాంబశివరావు, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ అశోక్, లెక్చరర్ వందనం బాబు, ప్రియదర్శిని, వలంటీర్లు పాల్గొన్నారు. కాగా మండలంలోని పాటిబండ్లలో కూడా కాకతీయ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఈ అశోక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధి కారి షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందనకు 128 ఫిర్యాదులు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్, తదితర అధికారులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట జిల్లా కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో జగనన్నకు చెబుదాం స్పందన ఫిర్యాదులను సోమవారం కలెక్టరేట్‌లో శివ శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కే వినాయకం స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖలకు అందిస్తూ త్వరిగతిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు 1258 ఫిర్యాదులు అందినట్లు జిల్లా కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. అర్జీదారులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా సహకారంతో అన్నదానాన్ని నిర్వహించారు.

గురుకుల విద్యాలయ సంస్థను ఏర్పాటు చేయాలి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26: నరసరావుపేట పరిసర ప్రాంతాలలో భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశ్యంతో ఒక ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఏర్పాటుచేయాలని ఎంఆర్‌పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య కోరారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్ర మంలో భాగంగా స్పందనలో కలెక్టర్ శివశంకర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో కత్తి శంకరరావు, ఎల్.రమణరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో రూ.25 లక్షలు మోసం


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 26: క్రిప్టో కరెన్సీ పేరుతో తనను ఇద్దరు వ్యక్తులు రూ.25లక్షల మేర మోసగించారని రెంటచింతలకు చెందిన నాగండ్ల వెంకటేశ్వర్లు సోమవారం ఎస్పీని ఆశ్రయించారు. సదరు ఇరువురు వ్యక్తులు గత రెండు సంవత్సరాల నుంచి తన వద్ద నుంచి సుమారు రూ.25 లక్షలు ఫోన్ పే ద్వారా బదిలీ చేయించుకున్నారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని, తగు న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బొల్లాపల్లి మండలం గండి గనుముల గ్రామానికి చెందిన రామావత్ లక్ష్మీనాయక్‌కు నాలుగు ఎకరాల పొలం ఉందని, పక్క పొలం నుంచి ఆరు అడుగుల లోతులో పైపు ద్వారా నీటిని తెచ్చుకుంటుండగా సదరు పొలం వ్యక్తి ఆ పైపు తీసివేయాలని ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదుచేశారు. అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన శాఖమూరి శ్రీనివాస్ తన పొలంలో మొక్క జొన్న, నువ్వులు, జొన్న పంటను వేయగా అదే గ్రామానికి చెందిన వ్యక్తులు ట్రాక్టర్లతో దున్ని నష్టం కలిగించారని, పంట నాశనం చేశారని, తగు న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించారు. ప్రజలకు ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీసు సిబ్బంది సహాయ సహకారాలు అందజేశారు. దాతల సాయంతో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనాన్ని పోలీసు అధికారులు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ డీ రామ చంద్రరాజు, అడ్మిన్ అదనపు ఎస్పీ రాఘవేంద్ర, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, దిశ డీఎస్పీ సుధాకరరావు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి సహకరించలేదనే టీడీపీలోకి మక్కెన

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ, ఫిబ్రవరి 26: తన అక్రమాలకు, ఆదాయానికి, అవినీతికి సహకరించలేదనే మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీలోకి వెళ్లారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీలో ఉన్నంత కాలం ఆయన వల్ల తనకు ఎలాంటి లబ్ధి జరగలేదని, టీడీపీలోకి వెళ్లడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మక్కెన అవినీతి ఏమిటో వినుకొండ ప్రాంత ప్రజలకు తెలుసన్నారు. జీవీ ఆంజనేయులు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మక్కెన అవినీతికి సహకరించాడు కాబట్టే టీడీపీలోకి వెళ్లాడని అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో తన మామను అడ్డంపెట్టుకొని చెరువుల వ్యాపారం పేరుతో కోట్ల రూపాయలు మక్కెన దోచుకున్నారని దుయ్యబట్టారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంత ఇచ్చాడో, నీవు ఎంత తీసుకున్నావో మీరిద్దరూ గుడిలో ప్రమాణం చేస్తారా అని మక్కెనకు సవాల్ విసిరారు. నేను మక్కెన మల్లికార్జునరావుకు రూ.40లక్షలు డబ్బులు ఇచ్చానని, ఈ డబ్బులు తీసుకోలేదు అని ప్రమాణం చేస్తావా అని అన్నారు.

ఆధార్ అక్రమాలతో ఓట్లు పొందేందుకు వైసీపీ కుట్రలు

శావల్యాపురం, ఫిబ్రవరి 26: ఓటు హక్కును పొందేందుకు వయసు సరిపోక ఆధార్ కార్డుల్లో అక్రమంగా వయసును మార్చి ఓట్లును పొందేందుకు వైసీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు ఆరోపించారు. శావల్యాపురం సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వివిధ చోట్ల ఒకే పేరుతో ఉన్న ఓటర్లను ఆధారంగా చూపించి, జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న విద్యార్థులు, వ్యాపారులు, వలస కూలీల ఓట్లు తొలగించేందుకు ఫారం-7లు పెట్టి అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని, అది చాలదన్నట్లు అర్హతలేని ఓట్లు కోసం ఆధార్‌లో అక్రమాలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షులు గద్దె వీరమస్తాన్ రావు, టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాథం, గోరింట్ల హనుమంతరావు, చింతా గంగయ్య, అన్నవరపు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 26: టీడీపీ గెలుపే లక్ష్యంగా సాధికార సారథులు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో శావల్యాపురం మండల సాధికార సారథులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ సమష్టిగా సైనికుల్లా పనిచేసి టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఎన్నికలవరకు ప్రతిఒక్కరూ ప్రజల్లో ఉండాలని సూచించారు. చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్ గ్యారెంటీ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వ్యవహరిస్తే వాటిని గుర్తించి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో గుంటూరు సాంబశివరావు, గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, అమృతపూడి కోటయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, బోడెపూడి శంకర్, పారా చౌదరి, గోపాలం శివయ్య, చింతా గంగయ్య గోనుగుంట్ల ధనుంజయ్, గడిపూడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీపై ప్రచారం


బాబు ష్యూరిటీపై ప్రచారం చేస్తున్న పల్నాడు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 26: బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 23వ వార్డులో పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నాగశ్రీనులు పాల్గొని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే అన్నివర్గాలకు న్యాయం జరిగిందని, వైసీపీ వచ్చిన తరువాత రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని విమర్శించారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపుతో అనేక పన్నులు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పట్టణంలో భయానక వాతావరణాన్ని సృష్టించి ఎన్నడూ లేనివిధంగా ప్రజలను రెచ్చగొట్టి వాటిని ఓట్లుగా మల్చుకోవడానికి చూస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వినుకొండ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.159 కోట్ల నిధులు తీసుకొస్తే ఆ పథకాన్ని పూర్తి చేయని అసమర్థ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే బొల్లాను, రాష్ట్రంలో వైసీపీని ప్రజలు భూస్థాపితం చేస్తారన్నారు. కార్యక్రమంలో పత్తి పూర్ణచంద్రరావు, సౌదాగర్ జానీబాషా, దబ్బాల సుభాని, పి.వి.సురేష్, గోల్డ్ కరిముల్లా, తెలుగు మహిళలు ఆదిలక్ష్మి, బొట్లగుంట లక్ష్మి, ముప్పూరి చౌడమ్మ, అన్నపూర్ణ, సుబ్బులు, మంగమూరి రాధ, తులసి, షమీనా తదితరులు పాల్గొన్నారు.

బొల్లా వేల కోట్లు ఎలా వచ్చాయి..?: మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, ఫిబ్రవరి 26: ఒక లారీ క్లీనర్‌గా మొదలైన బొల్లా బ్రహ్మనాయుడు ప్రస్థానం వేలకోట్ల రూపాయల స్థాయికి ఎలా చేరుకున్నాడో, దాని వెనుక ఉన్న మంత్రదండం ఏమిటో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రశ్నించారు. పట్టణంలోని మక్కెన కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తనపై బొల్లా చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. తన వ్యాపారాలు అందరికీ తెలిసినవే అని, చేపలచెరువుల వ్యాపారం చేసేటప్పుడు లాభనష్టాలు ఉంటాయని, లాభాలు వచ్చినా, నష్టాలు వచ్చినా భరించేది తానే అన్నారు. చెరువు ఆక్రమించుకొని గ్రామాలకు ఆర్థికనష్టం చేకూర్చానని బొల్లా చేసిన విమర్శలు అర్థరహితమన్నారు. సింగరచెరువులో ఏ రోజూ వ్యాపారం చేయలేదన్నారు. రూ.40లక్షలు నాకు ఇవ్వలేదని, తన కుమారుడు సంస్థలో పనిచేసే ముత్తినేని శ్రీనివాసరావుకు ఇచ్చి ఎన్నికలకు ఖర్చుపెట్టాలని చెప్పారని, అప్పుడే ముత్తినేని శ్రీనివాసరావు జమాలెక్కలతో అప్పజెప్పడం జరిగిందని, మక్కెన సమక్షంలో ముత్తినేని శ్రీనివాసరావు వెల్లడించారు. రూ.10కోట్లు కాదని, రూ.3కోట్లు ఎంపీని ఎన్నికలకు బొల్లా కోరారని, పార్టీ పెద్దల సమక్షంలో వారిరువురు చేసుకున్న ఒప్పందంపై తాను సమాధానం చెప్పనవసరం లేదన్నారు. నీ అవినీతిని, అక్రమాలను త్వరలో బయటపెడతానని అన్నారు. జీవీ ఆంజనేయులుకు, నాకు మధ్య చిచ్చు పెట్టడానికే బొల్లా ప్రయత్నిస్తున్నారని, రాజశేఖరరెడ్డి తరువాత రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల సమర్థత చంద్రబాబుకు ఉందనే ఉద్దేశంతో టీడీపీలో చేరుతున్నాని మక్కెన మల్లికార్జునరావు అన్నారు.

అమృత్‌భారత్ పథకానికి వినుకొండ స్టేషన్ ఎంపిక

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 26: ఇటీవల ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ స్టేషన్ పథకానికి వినుకొండ రైల్వేస్టేషన్ ఎంపికైనట్లు బీజేపీ నాయకులు యార్లగడ్డ లెనిన్, మేడం రమేష్‌లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం ప్రస్తుతం భారతీయ రైల్వే వ్యవస్థలో 1275 స్టేషన్లు అప్‌గ్రేడ్ చేయడానికి, ఆధునీకరించడానికి పూనుకుందని, 1500 ఆర్వోబీ, ఆర్‌యూబీలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వినుకొండ రైల్వేస్టేషన్ ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవులు, రైల్వే అధికారులు గౌతమ్, విజయభాస్కర్, సురేష్, సునీల్‌కుమార్, జాన్‌వెస్లీ, భవాని శంకర్‌లు పాల్గొన్నారు.


గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

గిరిజన గురుకుల బాలికల పాఠశాల ప్రారంభం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని పెదతురకపాలెంలో రూ.9.51 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన 13 గదులు, రెండు డార్మెటరీలు, కిచెన్, డైనింగ్ హాలును ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, డీటీడబ్ల్యూవో వరలక్ష్మి, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీలపై భారం మోపితే ఎలా..?

● ప్రభుత్వ ఉత్తర్వులపై సర్పంచ్‌ల ఆవేదన

శావల్యాపురం, ఫిబ్రవరి 26: ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధులను గ్రామ పంచాయతీలపై భారంమోపి పంచాయతీ నిధులను చెల్లించమంటే గ్రామాలలో మౌలిక వసతుల మాటేమిటని కొందరు సర్పంచ్‌లు పెదవి విరుస్తున్నారు. నర్సరావుపేట డివిజన్ పరిధిలో మార్చి 8వ తేదీన జరగనున్న కోటప్పకొండ తిరునాళ్ళకు పారిశుద్య కార్యక్రమాల ఖర్చులకు మండల పరిషత్‌ల నుంచి రూ.50వేలు, మేజర్ పంచాయతీల నుంచి రూ.20వేలు, మైనర్ పంచాయతీల నుంచి రూ.10వేలు జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామపంచాయతీలకు నిధులు సక్రమంగా అందక మౌలిక వసతులు కల్పించేందుకే ఇబ్బందులు పడుతుంటే తిరునాళ్ళ ఖర్చులకు పంచాయతీ నిధులు చెల్లించాలని ప్రభుత్వం భారం మోపడం ఎంతవరకు సమంజసమని పలువురు సర్పంచ్‌లు వాపోయారు. ఇటీవల పంచాయతీలకు విడుదలైన నిధులను వెంటనే ఖర్చు చేయాలని, లేకుంటే పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో గ్రామాలలో చేపట్టిన చిన్నపాటి అభివృద్ధి పనులను పూర్తిచేసేందుకు ఇబ్బందులు పడ్డామన్నారు. తిరునాళ్ళ ఖర్చులకు పంచాయతీలపై భారం మోపకుండా ప్రభుత్వమే భరించాలని పలువురు సర్పంచ్‌లు కోరుతున్నారు.

రీసర్వేలో జరిగిన అవకతవకలపై నిరసన

వినుకొండటౌన్, ఫిబ్రవరి 26: వినుకొండ మండలంలో నిర్వహించిన రీసర్వేలో అక్రమాలు జరిగాయంటూ బాధితులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ గ్రామంలోని జాలలపాలెం గ్రామానికి చెందిన సురభి లక్ష్మి సర్వే నెం.48/2-2ఎ 12లో 1-74ఎకరాకు గాను 85సెంట్లు వచ్చిందని, బ్రాహ్మణపల్లిలో సర్వే నెం. 256-ఎ1లో 50సెంట్లు, 183-2లో 75సెంట్లు యాదాల సుబ్బారావుకు తన వాటాగా రాగా, యాదాల వెంకట సుబ్బయ్య పేరుతో రీసర్వేలో వచ్చిందని, ఇలా వచ్చిన సర్వే భూముల వివరాలను పొందుపరుస్తూ బాధితులు, ప్రజాసంఘాల నాయకులు డీటీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

రొంపిచర్ల, ఫిబ్రవరి 26: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో సరోజిని సోమవారం పరిశీలించారు. తుంగపాడు, అన్నవరం, రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడు, రామిరెడ్డిపాలెం, బుచ్చిపాపన్నపాలెం, ఆరేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బూత్‌లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద గ్రామస్థులతో మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ ఉషారాణి, డీటీ అంకారావు, ఆర్ఐ సుబ్బారావు, బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

రొంపిచర్ల, ఫిబ్రవరి 26: మండలంలోని రెడ్డిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మాజీ సర్పంచ్ వరికూటి ఓబులరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషిచేశారన్నారు. శ్రీనివాసరెడ్డిని హెచ్‌ఎం హనుమంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడిపై దాడి

నూజెండ్ల, ఫిబ్రవరి 26: యువకుడిపై దాడిచేసిన సంఘటన మండలంలోని పాతకొత్తపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అమరా రమేష్ పొలం నుంచి ట్రాక్టర్‌పై పొగాకు తీసుకు వస్తుండగా అదే గ్రామానికి చెందిన కొండి అంకమ్మరావు, అనీల్, అఖిల్, రమణలు తమ ట్రాక్టర్‌తో రమేష్ ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. అనంతరం రమేష్ కళ్ళల్లో కారం చల్లి కర్రలు, మారణాయుధాలతో దాడి చేశారు. దీంతో రమేష్‌కు చేయి విరగటంతో పాటు తలపై తీవ్రంగా గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. వైసీపీ నాయకుడిగా ఉన్న తనను దాడికి పాల్పడిన వారు గతంలో టీడీపీలోకి రావాలని కోరారని, వారి మాటలను తాను లక్ష్య పెట్టకపోవటంతో తనపై దాడికి పాల్పడినట్లు పోలీసులకు రమేష్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వైద్యశాలలో పరామర్శించి టీడీపీ నాయకుల దాడిని ఖండించారు. పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ బాధితులపై కేసులు పెట్టించేటువంటి రాజకీయాలకు ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మౌలిక సదుపాయాలపై పరిశీలన: ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నూజెండ్ల, ఫిబ్రవరి 26: గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు ప్రజల జీవన విధానంను పరిశీలించనున్నట్లు ట్రైనీ కలెక్టర్ ఆర్‌కే కల్పశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో, ముప్పరాజువారిపాలెం సచివాలయాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ మండలంలో మూడు రోజుల పాటు పలు గ్రామాల్లో పర్యటించి ప్రజల స్థితిగతులను అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీ వీరభద్రాచారి, డీటీ ఎం.అర్జున్‌నాయక్, వీఆర్వో జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రబ్బానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వయ్యకల్లు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణం, శిలా ఫలకంపై కిటీలపై వేసిన పేడ

ప్రాథమిక పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు

వయ్యకల్లు (శావల్యాపురం)ఫిబ్రవరి 26: మండలంలోని వయ్యకల్లు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆకతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయి. పాఠశాలలోని శిలాఫలకాలు, గోడలు, కిటికీలు, బండలపై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పశువుల పేడను చల్లారు. సోమవారం ఉదయాన్నే పాఠశాలకొచ్చిన ఉపాధ్యాయులు దీనిపై గ్రామసర్పంచ్‌కి సమాచారం అందించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఎస్సీ కాలనీ వ్యక్తి రెండేళ్ళ క్రితం పాఠశాల ఆవరణలో దుకాణాన్ని ఏర్పాటుచేశాడని, ఇటీవల అదే దుకాణంపై మా నమ్మకం నువ్వే జగన్ అంటూ డిజిటల్ బోర్డును కూడా ఏర్పాటు చేశాడని, విద్యార్థులులు చదువుకునే పాఠశాల ఆవరణలో ఇలా రాజకీయ పార్టీలకు చెందిన బోర్డుల ఏర్పాటుపై స్థానికులు ప్రశ్నించారు. ప్రహరీ లేక పాఠశాల స్థలం ఆక్రమణలకు గురవుతోందని, మరుగుదొడ్డికి వెళ్ళాలంటే టీచర్లు, బాలికలు ఇబ్బందులు పడుతున్నారని, మౌలిక వసతులు సక్రమంగా లేక విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరారు.

స్కూలు బస్సును ఢీకొన్న లారీ: విద్యార్థులకు స్వల్ప గాయాలు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 26: కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట పట్టణం వద్ద స్కూలు బస్సును లారీ ఢీకొన్న సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూలు నుంచి విద్యార్థులను ఎక్కించుకుని వినుకొండ వైపు వెళ్తున్న స్కూలు బస్సును లారీ ఢీకొట్టడంతో బస్సు రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్ళింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను పట్టణంలోని వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని నరసరావుపేట రూరల్ ఎస్.రోశయ్య పరిశీలించారు.

ఎనిమిది గ్రామాల్లో ఉద్యోగులకు ఇంటి అద్దె భత్యం పెంపు

రొంపిచర్ల, ఫిబ్రవరి 26: నరసరావుపేట మునిసిపాలిటీలలో ఐదు గ్రామాలు విలీనం జరగటం వల్ల జీ ముప్పాళ్ళ, విప్పర్లపల్లి, గోనెపూడి, పమిడిపాడు, పరగటిచర్ల, కోటప్పకొండ గ్రామాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటిఅద్దె భత్యం పెంపుదల చేస్తూ కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారని పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌మోజెస్ సోమవారం తెలిపారు. అదేవిధంగా చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలో యడ్లపాడు, నాదెండ్ల గ్రామాల్లో పనిచేస్తున్న వారికి కూడా ఇది వర్తిస్తుందన్నారు. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి గ్రామాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదిశాతం నుంచి 12 శాతం, పదిశాతం నుంచి 16శాతం వర్తించనున్నట్లు వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, అబ్దుల్ సత్తార్ తెలిపారు.


భవిష్యత్‌కు గ్యారెంటీ రిజిస్ట్రేషన్ పత్రాలను పంచుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి, జనసేన నేత రాజా రమేష్

మద్యం మరణాలకు పూర్తి బాధ్యత జగన్‌దే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో మద్యం మరణాలకు పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌దేనని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి అదే మద్యంలో లక్షల కోట్ల కుంభకోణాలుచేసి నాసిరకం మద్యంతో వేలాదిమంది ప్రాణాలుతీసిన వ్యక్తి దేశ రాజకీయాల్లో బహుశ జగన్‌రెడ్డి ఒక్కడే కావచ్చన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఏరులై పారుతున్న జగన్ బ్రాండ్ మద్యం సాక్షిగా జగన్ ఇచ్చిన మద్యం నిషేధం హామీ ఏ గాలికి కొట్టుకుపోయిందని ప్రత్తిపాటి ప్రశ్నించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పసుమర్రులో పర్యటించిన ప్రత్తిపాటి ఇంటింటికి తిరిగి సూపర్ - 6 పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త తోట రాజా రమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ఈపూరు, ఫిబ్రవరి 26: విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న ఉపాధ్యాయుడు సస్పెండ్ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని కొండ్రముట్ల హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస నాయక్ ఓ విద్యార్థిని లైంగికంగా వేధిస్తుండటంపై తోటి విద్యార్థులు హెచ్‌ఎం ఎస్‌సీహెచ్ బాలజ్యోతిలక్ష్మికి ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం ప్రాథమిక విచారణ జరిపి విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో వినుకొండ ఎంఈవో జఫ్రుల్లాఖాన్ స్కూల్‌లో విచారణ జరిపి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులిచ్చారు.

మహిళ అనుమానాస్పద మృతి

సొలస (యడ్లపాడు), ఫిబ్రవరి 26: యడ్లపాడు మండలం కొత్తసొలసలో ఒంటరి మహిళ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామ పరిధిలోని తూర్పు పొలాలవైపు ఉన్న శ్మశాన వాటిక సమీపంలోని ఓ బావిలో మహిళ మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పట్టేపురం గ్రామానికి చెందిన చలంచర్ల నాగమ్మ (55)గా గుర్తించారు. భర్త కోటేశ్వరరావుతో విభేదాలు నెలకొన్న నేపథ్యంలో కొంతకాలంగా పిల్లలకు, భర్తకు దూరంగా ఉంటోంది. తొలుత కారంపూడిలో ఉంటూ రెండేళ్ళ క్రిందట కొత్త సొలస గ్రామానికి వలస వచ్చింది. గ్రామంలోని ఎస్టీ కాలనీలో సమీప బంధువుల వద్ద ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఒంటరిగా జీవిస్తోంది. స్థానికుల సమాచారం మేరకు రూరల్ సీఐ పి.శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్‌లు సిబ్బందితో కలసి సోమవారం సంఘటన స్థలానికి చేరుకుని శవాన్ని బయటకు తీయించారు. గ్రామపెద్దల్ని, నాగమ్మ బంధువులను పిలిపించి మృతిచెందింది నాగమ్మే అని నిర్ధారణకు వచ్చారు. సుమారు నాలుగురోజుల కిందట మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

29న కొండవీడుకోటలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

యడ్లపాడు, ఫిబ్రవరి 26: మండలంలోని కొండవీడుకోటలో పునఃనిర్మించిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఈవో శివయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 27న కొండవీడు నుంచి కొత్తపాలెం మీదుగా కొండపైకి స్వామివార్ల శోభాయాత్ర, పూజా కార్యక్రమాలు, 28న స్వామివార్లకు యజ్ఞ, యాగ పూజా కార్యక్రమాలు, 29న యంత్రస్థాపన, ప్రతిష్ఠ మహోత్సవం, పూర్ణాహుతి, ధృవ దేవత కళ్యాణం ఉంటాయన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని, యాగశాల నిర్మాణం పూర్తయిందన్నారు. కార్యక్రమానికి మంత్రులు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతోనే నేల ఆరోగ్యంగా ఉంటుంది

● జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి అమలకుమారి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 26: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలు సాగుచేయడం ద్వారా నేల ఆరోగ్యంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కె.అమలకుమారి తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా సెర్ప్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఎం కె.అమలకుమారి మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న పంటలలో రసాయన ఎరువులు వినియోగం పెరగడం వల్ల వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమంలో టి.విజయ్‌కుమార్ పలు అంశాలను స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చీఫ్ బి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సెర్ప్ సీఈవో ఇంతియాజ్, శ్రీనిధి ఎండీ నాంచారయ్య, పల్నాడు జిల్లా నుంచి డీఆర్‌డీపీ బాలూనాయక్, డీపీఎం కె.అమలకుమారి, అదనపు డీపీఎం ప్రేమరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ - 6 పథకాలపై ప్రచారం

రొంపిచర్ల, ఫిబ్రవరి 26: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాలతో రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు పెంపొందుతాయని టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని రొంపిచర్లలో మూడోరోజు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మేనిఫెస్టో గురించి వివరించారు. ఉమ్మడి మేనిఫెస్టోతో వైసీపీ నేతల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయని అరవిందబాబు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీకి ఓటువేసి అభివృద్ధిని ప్రజలు కోరుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురుతుందన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి, కళ్లి మల్లారెడ్డి, పల్లెల అంజిరెడ్డి, మందలపు వెంకట రత్నం, పెద్దినీడి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో చంద్రశేఖర్ ఆజాద్ సంస్మరణ సభ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26: బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అశువులు బాసిన చంద్రశేఖర్ ఆజాద్ 93వ సంస్మరణ సభను జయప్రదం చేయాలని పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ అన్నారు. సోమవారం నరసరావుపేటలో సంస్మరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆస్ట్రేలియాలో తెలుగుదేశం పార్టీకి మద్దతుగా శంఖారావం

నూజెండ్ల, ఫిబ్రవరి 26: మండలానికి చెందిన లగడపాటి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ సిటీలో టీడీపీ సభ్యులు, ఔత్సాహికులు టీడీపీ విజయానికి ఆదివారం శంఖారావం పూరించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లగడపాటి సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘన విజయానికి అంకిత భావంతో పని చేస్తామన్నారు.

బీజేపీ ప్రజా పోరు

నూజెండ్ల, ఫిబ్రవరి 26: మండలంలోని ఐనవోలు, పాతరెడ్డిపాలెం, పాత చెరుకుంపాలెం, కంభంపాడు, తెల్లపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో సోమవారం బీజేపీ నాయకులు ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎండ్లూరి వీరయ్య లక్ష్మీనారాయణ, పూరేటి పేరయ్య, వేమన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు

రొంపిచర్ల, ఫిబ్రవరి 26: మండలంలోని సంతగుడిపాడు కేజీబీవీ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం కిశోర బాలికల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీబాయి, షమీమ్ సుల్తానా మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి బాలశౌరీలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.